# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


**నేటి కందం- నేటికి అందం**

పావన కంప్యూటరు పై
కావించుచు శోధనములు కర్మణ్యతతుల్
జావా ప్రోగ్రామింగును
దేవుని దయతోడ మనకు తెలిపిరి ధృతిలోన్ !!



(23-5-1995 జావా ప్రోగ్రామింగ్ ప్రారంభం)

**చురక**

గత పాలన బాగుంటే
గిట్ల తీర్పు ఎట్లిస్తరు
అధికారం నుండి జనం
ఆగ్రహించి దించేస్తరు
గతం వర్తమానానికి
గొప్పనైన గుణపాఠం
నేర్వకుంటే ఎవరికైనా
నేలకూలు తమ పీఠం

-వేల్పుల నారాయణ
9440433475




హైదరాబాద్ శుక్రవారం 23-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:222 పేజీలు:6 వెల: రూ.1/-


## ఎనిమిదో రోజూ అదే భక్త జన ప్రవాహం

కాళేశ్వరం, మే 22: సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు ఘనంగా కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున మన రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, హారతులతో ఘాట్‌ల పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనార్థం బారీ క్యూలైన్లలో నిలబడి భక్తిని చాటుకుంటున్నారు. పుష్కర స్నానానికి భద్రతా దళాలు, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది సహా వాలంటీర్లు సమర్థంగా సేవలందిస్తున్నారు.

భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, అధికారులు అదనపు ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నీటి సరఫరా, వైద్య సహాయ కేంద్రాలు, విస్తృతంగా అందుబాటులో తెచ్చారు. పుష్కరాల ముగింపుకు ఇంకా 4 రోజులు సమయం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అన్ని ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు. భక్తులు పుష్కరాల్లో పాల్గొనాలని, సూచించిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ మే 22:అడవుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని పిడియా అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్న భద్రతా దళాలు.. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కాల్పుల్లో డీఆర్‌జీ జవాన్‌తోపాటు మరో సభ్యుడు మృతిచెందగా.. మరికొందరు జవాన్లు గాయపడ్డారు. గాయపడిన జవాన్ తాజాగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్-దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో చోటు చేసుకున్నది.



## గురుకుల కార్యదర్శి వర్షిణిపైమంత్రి సీరియస్

**-గురుకుల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారన్న దామోదర**
**-వసతులు ఎందుకు కల్పించడం లేదని ఆగ్రహం**

హైదరాబాద్, మే 22:సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణిపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాలోచిత నిర్ణయాలతో గురుకుల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వసతి కల్పించాలని ఆదేశించారు. నేటి నుంచి ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అన్ని గురుకులాలు పరీక్షలు రాసే విద్యార్థులకు భోజన, వాహన వసతులు కల్పిస్తున్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ మాత్రం ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో విషయాన్ని జై భీమ్ యూత్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీహరి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకెళ్లారు.

ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని, సిబ్బందిని సైతం బానిసల కంటే హీనంగా చూస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి సొసైటీ సెక్రటరీ వర్షిణికి ఫోన్‌చేసి వసతులు ఎందుకు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పూర్తి నివేదిక అందివ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

## నాలుగు జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆరెంజ్ అలెర్ట్ జారీ..!

హైదరాబాద్, మే 22:తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 27వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఆ తర్వాత రెండురోజుల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని చెప్పింది. రాబోయే రెండురోజుల్లో కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని.. ప్రస్తుతం కేరళ, తమిళనాడు, కర్నాటకలో నైరుతి రుతుపవనాలు ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. ఈ క్రమంలో గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఉరుములు, మెరుపులు, గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే, ఆదిలాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని చెప్పింది. కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని చెప్పింది.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి



ఖమ్మం, మే 22:తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున నాలుగున్నర లక్షల ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్మాణం పూర్తి చేసుకున్న వెయ్యి ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

మిగతా వాటిని విడతల వారీగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా రైతులకు పూర్తి భరోసా లభిస్తుందన్నారు. తాసీల్దార్ స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం చూపిస్తారన్నారు. గతంలో మాదిరిగా వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థను తీసుకురానున్నట్లు వెల్లడించారు. సర్వేయర్లకు కూడా శిక్షణ ఇచ్చి నియమిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# తాబేళ్లను అంతరించకుండా చూసుకుందాం !

### (23 మే "ప్రపంచ తాబేలు దినం" సందర్భంగా)

హిందూ పురాణాల్లో విష్ణువు రెండవ అవతారంగా తాబేలు లేదా కూర్మం భూమిని మోస్తూ, సముద్రంలో తేలుతూ ఉంటుంది. కూర్మం మన సంస్కృతిలో రక్షకుడిగా, క్షీరసాగర మథనంలో కీలక పాత్రను పోషించింది. దీర్ఘాయువు, పునరుత్పత్తి,, సృష్టి, జ్ఞానం, సంక్షేమాలకు చిహ్నంగా కూర్మం పరిగణించబడుతున్నది. సరీసృపాల వర్గానికి చెందిన తాబేళ్ల శరీరం గట్టి పెంకులతో కప్పబడి ఉంటుంది. నిదానంగా నడిచే తాబేళ్లు నీటిలోనూ, నేల పైనా జీవించగలవు. తాబేళు ్ల తమ కోసం భూమిపై రంధ్రాలను చేసుకొని బతుకుతూ, ఇతర జీవులకు కూడా ఆవాసాలను అందిస్తాయి. చనిపోయిన సముద్ర చేపలను తింటూ, సముద్ర జలాల స్వచ్ఛతను కూడా కాపాడే తాబేళ్లు సాదు జంతువుగా కూడా ఉపయోగపడుతున్నాయి. నటి ఆధునిక యుగంలో సముద్ర జలాలు ప్లాస్టిక్ కాలుష్యంతో నుండి ఉండడంతో తాబేళ్ల లాంటి జలచరాల మనుగడ ప్రాణాంతకంగా కూడా మారుతున్నది.

ప్రపంచ తాబేలు దినం-2025:

ప్రకృతిలో ప్రతి జీవికి తనదైన ప్రత్యేకత, ప్రాధాన్యం ఉంటుందని మనకు తెలుసు. పర్యావరణ-హితవరిగా, జీవ వైవిధ్య పరిరక్షణలో ప్రధాన భాగమైన తాబేళ్ల ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2000 నుంచి ప్రతి ఏట 23 మే రోజున "ప్రపంచ తాబేలు దినం" లేదా "వరల్డ్ టర్టిల్ డే" పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కనిపించే తాబేళ్లు దాదాపు 320 రకాలుగా ఉన్నప్పటికీ అందులో దాదాపు 70 శాతం తాబేళ్లు అంతరించే అంచున నిలబడ్డాయి. జీవులు అంతరిస్తే జీవ వైవిధ్యం దెబ్బతిని జీవుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. తాబేళ్లు దాదాపు 150 ఏండ్ల వరకు జీవించగలవు. సర్వభక్షకులైన తాబేళ్లు హిందూ సమాజంలో పూజ్యనీయ స్థానాలను ఆక్రమించాయి. 2025 ప్రపంచ తాబేలు దినం ఇతివృత్తంగా "డ్యాన్సింగ్ టర్టిల్స్ రాక్ (నృత్యం చేస్తున్న తాబేళ్లను ప్రోత్సహిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

సాదు జంతువుల వలె మనతో సహజీవనం చేయగల తాబేళ్లను పరిరక్షించుకోవడం, వాచు మనుగడకు గొడుగులు పట్టడం మన కనీస కర్తవ్యం. వాస్తుశాస్త్రం ప్రకారం అతి పవిత్రమైన తాబేలు బొమ్మలు లేదా ప్రతిమలు లేదా విగ్రహాలను పూజ గదిలో పెట్టుకున్నట్లయితే మన వ్యాపారాలు, ఆనందాలు, శ్రేయస్సులు, పాజిటివ్ శక్తి, ఓర్పు లాంటివి వర్ధిల్లుతాయి. పూజ చేస్తున్నపుడు తాబేలు ప్రతిమపై తులసీ దళం ఉంచాలని పురాణాలు చెబుతున్నాయి. మన చుట్టు కనిపించే తాబేళ్లను పరిరక్షించుకుంటూ, భవిష్యత్తు తరాలకు జీవ వైవిధ్యాన్ని అందిస్తూ, పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేద్దాం. కూర్మాన్ని మనసుల్లో పెట్టుకొని ప్రేమిద్దాం, పోషిద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ..ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



జగిత్యాల,మే 22: హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు కు భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు వర్షంలోనూ కాలినడకన భక్తులు చేరుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు.

శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న అంజన్న క్షేత్రం కొండగట్టు ఆంజనేయ ఆలయం కాషాయమైంది. జై శ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో మార్మోగుతోంది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు, మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు.

# పదవీ బాధ్యతలు స్వీకరించిన జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌కు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అభినందన

న్యూఢిల్లీ, మే 22:జర్మనీ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఫ్రెడరిక్ మెర్జ్‌తో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు టెలిఫోన్‌లో సంభాషించి, అభినందనలు తెలిపారు.

గత 25 సంవత్సరాలుగా భారత్ - జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో అద్భుతమైన పురోగతిపై చర్చించారు. వాణిజ్యం - పెట్టుబడి, రక్షణ - భద్రత, ఆవిష్కరణ - సాంకేతికత వంటి రంగాలు సహా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేలా సన్నిహితంగా పనిచేయడానికి నాయకులిద్దరూ అంగీకరించారు. జర్మనీ పురోగతిలో భారతీయ ప్రవాసుల సానుకూల కృషిపైనా వారిద్దరూ చర్చించారు.

ఉమ్మడి ప్రయోజనాలున్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారు చర్చించారు.

# అందరినీ కలుపుకొని ముందుకెళ్తూ ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని తీర్చిదిద్దుదాం: ప్రధాని

న్యూఢిల్లీ, మే 22:జెనీవాలో జరిగిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 78వ సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. సమావేశాన్నుద్దేశించి మాట్లాడుతూ, ఈ ఏడాది ఇతివృత్తమైన 'ఆరోగ్యంపై ప్రపంచ ఐక్యత (వన్ వరల్డ్ ఫర్ హెల్త్)'ను ప్రముఖంగా ప్రస్తావించిన ఆయన సభకు హాజరైన వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యకరమైన ప్రపంచం కోసం భారత లక్ష్యానికి ఇది అనుగుణంగా ఉందన్నారు. 2023 వరల్డ్ హెల్త్ అసెంబ్లీ సందర్భంగా 'ఒక భూమి, ఒకే ఆరోగ్యం' గురించి మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమ్మిళితత్వం, సమగ్ర దృక్పథం, సహకారంపైనే భవిష్యత్ ఆరోగ్యకరమైన ప్రపంచం ఆధారపడి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

భారత ఆరోగ్య సంస్కరణల్లో సమ్మిళితత్వమే కీలకమని స్పష్టం చేసిన శ్రీ మోదీ.. ప్రపంచంలో అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమైన ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. 58 కోట్ల మంది ఈ పథకం పరిధిలో ఉన్నారని, ఉచిత చికిత్స అందిస్తున్నామని తెలిపారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన భారతీయులందరికీ వర్తించేలా ఇటీవల ఈ పథకాన్ని విస్తరించారు. పరీక్షల ద్వారా క్యాన్సర్, డయాబెటిస్, రక్తపోటు వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించేలా.. వేలాదిగా ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లతో దేశంలో విస్తృతమైన వ్యవస్థ ఉందని ప్రధానమంత్రి తెలిపారు. చాలా తక్కువ ధరలకే నాణ్యమైన ఔషధాలను అందిస్తూ వేలాదిగా ప్రభుత్వ ఫార్మసీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడంలో టెక్నాలజీ పాత్రను వివరిస్తూ.. భారత్ చేపట్టిన డిజిటల్ ప్లాట్ ఫాం, ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య గుర్తింపు వ్యవస్థ వంటి కార్యక్రమాలను శ్రీ మోదీ ప్రస్తావించారు. డిజిటల్ ప్లాట్ ఫాంను గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షించేలా రూపొందించగా... ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య గుర్తింపు ఏర్పాటు ప్రయోజనాలు, బీమా, రికార్డులు, సమాచారాన్ని ఏకీకృతం చేయడంలో ఉపయోగపడుతుంది. టెలిమెడిసిన్ ద్వారా అందరూ వైద్యులకు దగ్గరయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. 34 కోట్లకుపైగా సంప్రదింపులకు వీలు కల్పించిన భారత ఉచిత టెలిమెడిసిన్ సేవలను ఆయన ప్రశంసించారు. ఆరోగ్యం కోసం ప్రజలకు ఖర్చు విశేషంగా తగ్గిందని, దేశంలో చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాల వల్లే ఇది సాధ్యమైందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ప్రభుత్వ ఆరోగ్య వ్యయం గణనీయంగా పెరిగిందని తెలిపారు.

"అత్యంత దుర్బలురైనవారిని మనమెంత బాగా చూసుకుంటామన్నదానిపైనే ప్రపంచ ఆరోగ్యం ఆధారపడి ఉంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఆరోగ్యపరమైన సవాళ్లు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు.

భారత విధానాలు అనుసరణీయమైన, స్పష్టమైన, సుస్థిరమైన నమూనాలుగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. తన అధ్యయనాలను, అత్యుత్తమ విధానాలను ప్రపంచంతో, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందన్నారు.

జూన్ లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రపంచ దేశాలు పాల్గొనాలని ప్రధానమంత్రి కోరారు. యోగాకు భారత్ పుట్టినిల్లని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. 'ప్రపంచ ఐక్యత, అందరికీ ఆరోగ్యం కోసం యోగా (యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్)' అన్న ఈ ఏడాది యోగా దినోత్సవ ఇతివృత్తాన్ని వివరిస్తూ, అన్ని దేశాలకూ ఆహ్వానం పలికారు.

ఐఎన్‌బీ ఒడంబడికను విజయవంతం చేసినందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థకు, అన్ని సభ్య దేశాలకు శ్రీ మోదీ అభినందనలు తెలిపారు. గొప్ప అంతర్జాతీయ సహకారంతో భవిష్యత్ విపత్తులను ఎదుర్కొనేలా ఉమ్మడి నిబద్ధతగా ఆయన దీనిని అభివర్ణించారు. అందరినీ కలుపుకొని పోతూ ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా, రోగాలు దరిచేరకుండా ఉండాలంటూ వేల ఏళ్ల కిందటే భారత రుషులు చిరస్థాయిలో నిలిచేలా చేసిన ప్రార్థనలను వేదాల నుంచి ఉదహరిస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ఈ లక్ష్యం ప్రపంచాన్ని ఏకం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సైబర్ మోసాల నివారణను బలోపేతం చేసేందుకు

# "ఆర్థిక మోసాల ప్రమాద సూచిక (ఎఫ్ఆర్ఐ)"ను ప్రవేశపెట్టిన డీవోటీ

న్యూఢిల్లీ, మే 22:సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలను ఎదుర్కొనే దిశగా "ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్ఆర్ఐ)ను సంబంధిత వర్గాలతో పంచుకొంటున్నట్లు టెలికమ్యూనికేషన్ల విభాగం (డీవోటీ) ప్రకటించింది. సైబర్ మోసాల బారి నుంచి తమను తాము రక్షించుకొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఆర్థిక సంస్థలకు భరోసా ఇచ్చేందుకు డిజిటల్ ఇంటిలిజెన్స్ ప్లాట్‌ఫాం (డీఐపీ)లో భాగంగా ఎఫ్ఆర్ఐను రూపొందించారు. ఇది సైబర్ భద్రతను మెరుగుపరుస్తుంది. అలాగే ఈ టూల్‌తో గుర్తించిన మొబైల్ నంబర్లకు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ప్రయత్నించినప్పుడు హెచ్చరిస్తుంది. తద్వారా సైబర్ భద్రతను, ధ్రువీకరణ తనిఖీలను పెంపొందిస్తుంది

ఇది ఆర్థిక మోసాల విషయంలో ఒక మొబైల్ నంబర్ మధ్యస్థ, ఎక్కువ లేదా అత్యంత ఎక్కువ ప్రమాదంతో సంబంధం కలిగి ఉందని వర్గీకరించే మోసం ఆధారిత స్కేలు. ఈ వర్గీకరణ ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీలు), నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ), టెలికమ్యూనికేషన్ల విభాగానికి చెందిన చక్షు ప్లాట్‌ఫాం, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సహా సంబంత వర్గాలు పంచుకున్న సమాచారం ఆధారంగా ఉంటుంది. ఏదైనా మొబైల్ నంబర్ అత్యంత ప్రమాదకరమని భావిస్తే తీసుకోవాల్సిన చర్యల అమలుకు ప్రాధాన్యమివ్వడానికి, వినియోగదారుల కోసం అదనపు రక్షణ చర్యలు చేపట్టడానికి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు తదితర సంస్థలకు అధికారం కల్పిస్తుంది.

సైబర్ నేరాలకు పాల్పడటం, పున:ధ్రువీకరణలో విఫలమవడం, నిర్దేశించిన పరిమితిని దాటడం సహా ఇతర కారణాల వల్ల సేవలు నిలిపివేసిన మొబైల్ నంబర్ల జాబితాను (మొబైల్ నంబర్ రీవోకేషన్ లిస్ట్ ఎంఎన్ఆర్ఎల్) డీవోటీకి చెందిన డిజిటల్ ఇంటిలిజెన్స్ యూనిట్ (డీఐయూ) క్రమం తప్పకుండా సంబంధిత వర్గాలతో పంచుకుంటుంది. సాధారణంగా ఈ నంబర్లను ఆర్థిక మోసాల కోసం వినియోగిస్తారు.

సాధారణంగా సైబర్ మోసాలకు దుర్వినియోగం చేసే మొబైల్ నంబర్ల జీవితకాలం చాలా తక్కువ రోజులే ఉంటుంది. వీటిని పూర్తి స్థాయిలో ధ్రువీకరించడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి నంబర్లతో సంబంధం ఉన్న ప్రమాదాన్ని ముందే గుర్తించడంలో తోడ్పడుతుంది. అంటే, అనుమానిత మొబైల్ నంబర్‌ను ఆర్థిక సంస్థలు గుర్తించినప్పుడు దానిని వివిధ కోణాల్లో విశ్లేషిస్తారు. అనంతరం మధ్యస్థ, ఎక్కువ, అత్యంత ఎక్కువ స్థాయి ఆర్థిక ముప్పును కలిగి ఉన్నదానిగా వర్గీకరిస్తారు. ఆ తర్వాత డీఐపీ ద్వారా ఈ నంబర్‌కు సంబంధించిన సమాచారాన్ని తక్షణమే తెలియజేస్తారు.

ఎఫ్ఆర్ఐను మొదటగా స్వీకరించిన వాటిలో ఒకటైన ఫోన్ పే సంస్థ అత్యంత ఎక్కువ ముప్పు కలిగిన ఎఫ్ఆర్ఐ నెంబర్లకు లావాదేవీలను తిరస్కరించడానికి... ఫోన్‌పే ప్రొటెక్ట్ ఫీచర్లో భాగంగా స్క్రీన్‌పై హెచ్చరిక సందేశాన్ని చూపిస్తుంది. ఫోన్ పే పంచుకున్న డేటా ప్రకారం చిన్న సంకేతం ఆధారంగా గుర్తించిన ఫోన్ నంబర్లకు సైబర్ మోసాల కేసులతో సంబంధం ఉండే అవకాశం ఎక్కువని తేలింది. ఇది ఎఫ్ఆర్ఐ సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. మధ్యస్థ స్థాయి ఎఫ్ఆర్ఐ నంబర్లకు లావాదేవీలు జరుపుతున్నప్పుడు వినియోగదారునికి ముందు జాగ్రత్తగా హెచ్చరిక సందేశాన్ని డిస్‌ప్లే చేసే దిశగా ఫోన్‌పే చర్యలు తీసుకుంటోంది.

### ఆర్థిక మోసాలను తగ్గించడానికి ఇతర రంగాల భాగస్వామ్యం

యూపీఐ లావాదేవీల్లో 90 శాతం వాటా ఉన్న ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే లాంటి ప్రముఖ యూపీఐ వేదికలు డీఐపీ హెచ్చరికలను వాటి వ్యవస్థలతో అనుసంధానించడం ప్రారంభించాయి. ఉదాహరణకు:ఒక ప్రముఖ యూపీఐ ప్లాట్‌ఫాం లావాదేవీల్లో జాప్యాన్ని, వినియోగదారుల ధ్రువీకరణతో పాటు, హెచ్చరిక సందేశాలను ప్రవేశపెట్టింది.

సైబర్ మోసాలను తగ్గించేందుకు ఇతర బ్యాంకులు సైతం ఈ సమాచారాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాయి.

దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన చెల్లింపుల విధానం యూపీఐ. కాబట్టి కొత్తగా ప్రవేశపెట్టిన విధానం లక్షల మంది పౌరులను సైబర్ మోసాల బారిన పడకుండా కాపాడుతుంది. టెలికం, ఆర్థిక రంగాల్లో అనుమానిత మోసాలను గుర్తించి, వేగంగా, సంయుక్తంగా చర్యలు చేపట్టే అవకాశాన్ని ఎఫ్ఆర్ఐ ఇస్తుంది. టెలికాం వనరుల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు జాతీయ స్థాయిలో సాంకేతికత ఆధారితన పరిష్కారాలను అమలు చేయడం, సంబంధింత వర్గాలతో కలసి డీవోటీ పనిచేస్తుంది. తద్వారా సురక్షితమైన టెలికాం వ్యవస్థను పౌరులకు అందిస్తుంది. హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచడానికి, ప్రతిస్పందన సమయాన్ని తగ్గించడానికి ఆర్థిక సంస్థలు, డిజిటల్ చెల్లింపు వేదికలతో కలసి డీవోటీ పనిచేస్తుంది. వినియోగదారుల వ్యవస్థల్లో ఎఫ్ఆర్ఐ ఏకీకరణ ఒక పారిశ్రామిక ప్రామాణికంగా మారుతుంది. అలాగే భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాగత స్థిరత్వాన్ని తీసుకొస్తుందని అంచనా వేస్తున్నారు.

# 'ప్రాజెక్ట్ లయన్'లో భాగంగా చేపడుతున్న ప్రయత్నాల పట్ల ప్రధానమంత్రి హర్షం

న్యూఢిల్లీ, మే 22:'ప్రాజెక్ట్ లయన్'లో భాగంగా చేపడుతున్న ప్రయత్నాల పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు గుజరాత్‌లో సింహాలకు అనుకూల పరిసరాలను సమకూర్చడంతో పాటు వాటి సంరక్షణకు కూడా పూచీపడుతున్నాయి.

గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ ఎక్స్‌లో పొందుపరి చిన ఒక సందేశానికి శ్రీ మోదీ ప్రతిస్పందిస్తూ.."చాలా ఉత్సాహాన్నిచ్చే సమాచారమిది. 'ప్రాజెక్ట్ లయన్'లో భాగంగా చేపడుతున్న ప్రయత్నాలతో, గుజరాత్‌లో సింహాలకు అనుకూ లమైన వాతావరణం నెలకొనడం తోపాటు వాటి సంరక్షణకు అన్ని జాగ్రత్తచర్యలను తీసుకొంటుండడాన్ని చూస్తే ఎంతో సంతోషం కలుగు తోంది" అని పేర్కొన్నారు.




# పునరాభివృద్ధి పనులు పూర్తి చేసిన అమృత్ స్టేషన్లను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 22:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 22న రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆయన ఉదయం సుమారు 11 గంటలకు బీకానేర్‌కు వెళ్తారు. దేశ్‌నోక్‌లో కరణీ మాత ఆలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకుంటారు.

పదకొండున్నర గంటలకు ప్రధాని.. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరభివృద్ధి పనులు పూర్తి చేసిన దేశ్‌నోక్ స్టేషను ప్రారంభించడంతో పాటు బికనేర్-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారు. ఆ తరువాత, రూ.26,000 కోట్లకు పైగా ఖర్చుతో చేపట్టే అనేక అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు కొన్నింటిని దేశ ప్రజలకు అంకితమివ్వనున్నారు. దేశ్‌నోక్‌లో ఒక బహిరంగసభను ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారు.

దేశంలో రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలను నిరంతరం మెరుగుపరచాలన్న నిబద్ధతకు అనుగుణంగా ప్రధాని 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 86 జిల్లాల్లో రూ.1,100 కోట్లకు పైచిలుకు ఖర్చుతో పునరభివృద్ధి పనులు పూర్తి అయిన 103 అమృత్ స్టేషన్లను ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 1,300కు పైగా స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతోఅభివృద్ధి చేస్తున్నారు. ప్రాంతీయ వాస్తుకళలకు అద్దంపడుతూనే, ప్రయాణికుల సౌకర్యాలను పెంచే దృష్టితో వీటిని తీర్చిదిద్దారు. కరణీ మాత ఆలయానికి వచ్చే తీర్థయాత్రికులు, పర్యటకులకు సేవలు అందించే దేశ్‌నోక్ రైల్వే స్టేషన్ పనుల్లో కరణీ మాత ఆలయ వాస్తుకళ, తోరణం-స్తంభం ఇతివృత్తాలను స్ఫూర్తిగా తీసుకున్నారు. తెలంగాణాలోని బేగంపేట రైల్వే స్టేషన్ పునరభివృద్ధి పనుల్లో కాకతీయ సామ్రాజ్య వాస్తుకళను స్ఫూర్తిగా తీసుకున్నారు. బీహార్‌లో థావే స్టేషన్‌లో 52 శక్తి పీఠాలలో ఒకటైన మాత థావేవాలీకి ప్రాతినిధ్యం వహించే విభిన్న కుడ్య చిత్రాలు సహా కళాకృతులను అమర్చారు. అంతేకాక, మధుబనీ పెయింటింగులను కూడా ఇక్కడ అలంకరించారు. గుజరాత్‌లోని డాకోర్ స్టేషన్‌కు రణ్‌ఛోడ్‌రాయ్ జీ మహారాజ్ ప్రేరణగా నిలిచారు. దేశవ్యాప్తంగా పునరభివృద్ధిపరచిన అమృత్ స్టేషన్లలో సాంస్కృతిక వారసత్వంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు, దివ్యాంగ జనులు సహా ప్రయాణికులను ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని మరీ తీర్చిదిద్దిన సౌకర్యాలకు తోడు మేలైన యాత్రానుభూతిని పంచడానికి దీర్ఘకాలం నిలిచి ఉండే హంగూ ఆర్భాటాలను ఏర్పాటు చేశారు.

భారతీయ రైల్వేలు తన నెట్‌వర్క్‌ను 100 శాతం విద్యుదీకరించే దిశగా వేగంగా పయనిస్తోంది. దీనితో రైల్వే కార్యకలాపాలు మరింత సమర్థంగాను, పర్యావరణానికి అనుకూలమైనవిగాను మారనున్నాయి. దీనికి అనుగుణంగానే, ప్రధాని చురూ-సాదుల్‌పుర్ రైల్వే లైను (58 కిలోమీటర్ల)తో పాటు సూరత్‌గఢ్-ఫలోదీ (336 కి.మీ.)కి శంకుస్థాపన చేస్తారు. విద్యుదీకరణ పూర్తయిన ఫులేరా-డెగానా (109 కి.మీ.), ఉదయ్‌పుర్-హిమ్మత్‌నగర్ (210 కి.మీ.), ఫలోదీ-జైసల్‌మేర్ (157 కి.మీ.)తో పాటు సమ్‌దడీ-బాడ్‌మేర్ (129 కి.మీ) రైలు మార్గాలను ప్రధాని దేశ ప్రజలకు అంకితం చేస్తారు.

రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహాన్ని అందించడానికి, ప్రధాని 3 వాహన అండర్‌పాసుల నిర్మాణం, నేషనల్ హైవేల విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఆయన రాజస్థాన్‌లో ఏడు రహదారి ప్రాజెక్టులను కూడా జాతికి అంకితం చేస్తారు. రూ.4,850 కోట్లకు పైగా వ్యయంతో ఈ రహదారి ప్రాజెక్టులు పూర్తి అయితే సరకు రవాణాతోపాటు ప్రజల రాకపోకలు సౌకర్యవంతంగా మారతాయి. ఈ హైవేలు భారత్-పాకిస్తాన్ సరిహద్దు వరకు విస్తరించిన కారణంగా, భద్రతా దళాల రాకపోకలు పెరగడంతోపాటు భారత రక్షణ సంబంధి మౌలిక సదుపాయాలు బలోపేతమవుతాయి.

అందరికీ విద్యుత్తు, హరిత ఇంధనం, స్వచ్ఛ ఇంధనం.. వీటిని అందుబాటులోకి తీసుకుపోవాలన్న దార్శనికతను ముందుకు తీసుకుపోవడంలో భాగంగా ప్రధాని బికనేర్, నావా, దీడ్‌వానా, కుచామన్ లో విద్యుత్తు ప్రాజెక్టులతో పాటు పార్ట్ బి పవర్‌గ్రిడ్ సిరోహీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, పార్ట్ ఇ పవర్‌గ్రిడ్ మేవాడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌ల విద్యుత్తు సరఫరాకు ఉద్దేశించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయన బికనేర్‌లో సౌర ప్రాజెక్టు, పవర్‌గ్రిడ్ నీమచ్, బికనేర్ కాంప్లెక్స్ నుంచి తరలింపునకు ఉద్దేశించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ, ఫతేహ్‌గఢ్-ఎఎ పవర్ స్టేషన్‌లో సరఫరా సామర్థ్యం విస్తరణ సహా విద్యుత్తు ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారు. ఇవి స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించనున్నాయి.

ప్రధానమంత్రి రాజస్థాన్‌లో మౌలిక సదుపాయాలను, సంధానాన్ని, విద్యుత్తు సరఫరాను, ఆరోగ్య సంరక్షణ సేవలను, నీటి లభ్యతను పెంచడానికి 25 ముఖ్య ప్రాజక్టులకు శంకుస్థాపన-ప్రారంభోత్సవం చేసి దేశ ప్రజలకు సమర్పించనున్నారు. వీటిలో రూ.3,240 కోట్లకన్నా ఎక్కువ ఖర్చుతో 750 కి.మీ. కి పైగా పొడవైన 12 స్టేట్ హైవేల ఉన్నతీకరణ పనులు, నిర్వహణ పనులకు శంకుస్థాపనలు, వాటిని దేశ ప్రజలకు అంకితం చేసే కార్యక్రమాలు భాగంగా ఉన్నాయి. వీటిలో మరో 900 కి.మీ. కొత్త హైవేలు కూడా కలిసి ఉన్నాయి. ప్రధానమంత్రి బికనేర్, ఉదయ్‌పుర్‌లలో విద్యుత్తు ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఆయన రాజ్‌సమంద్, భీల్‌వాడా, ధౌల్‌పుర్‌లలో నర్సింగ్ కళాశాలలను కూడా ప్రారంభించనున్నారు. ఇవి రాష్ట్రంలో ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాలను పెంచడంలో ముఖ్యపాత్రను పోషించనున్నాయి. ప్రధాని రఖంరఖును జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా , ఫ్లోరోసిస్ తగ్గింపు ప్రాజెక్టు 'అమృత్ 2.0'లో భాగంగా పాలీ జిల్లాలోని 7 పట్టణాల్లో 'పట్టణ నీటి సరఫరా పథకాల' పునర్‌వ్యవస్థీకరణ సహా వివిధ జల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, వాటిని దేశ ప్రజలకు అంకితం చేస్తారు.

# వెండితెరపై లైవ్.. గ్రామీణులతో పవన్ కల్యాణ్ మాటా మంతి

అమరావతి, మే 22: ప్రజా సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వెండి తెర ప్రత్యక్ష ప్రసారం ద్వారా మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రజలతో ఆయన ముఖా ముఖీ నిర్వహించారు. మన ఊరు ? మాటామంతి కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని రావివలస గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉండే సినిమా థియేటర్ లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. ఉప ముఖ్యమంత్రి మాటలు వినడమే కాకుండా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు.. అలాగే వారి సమస్యలను ఆన్ లైన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పవన్ వెల్లడించారు. అభిమానుల తాకిడి, భద్రత కారణాల వల్ల ప్రజలతో నేరుగా కలవలేకపోతున్నానని అంటూ ఈ క్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడాలని నిర్ణయించినట్లు తెలిపారు..

ఈ కార్యక్రమం కోసం రావివలస గ్రామానికి చెందిన 290 మందిని హాజరయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకు మొదలైన ఈ లైవ్ షో మూడు గంటలకు పైగా సాగింది. ఇది ఇలా ఉంటే వెండి తెరను.. ప్రజల వేదన తీర్చే సాధనంగా మార్చారంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను గ్రామస్తులు ప్రశంసించారు.

# రెండో రోజూ కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ



సిద్దిపేట, మే 22: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ను మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. గురువారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి ఆయన వెళ్లారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశంలో తదుపరి కార్యాచరణపై నేతలిద్దరూ చర్చించే అవకాశం ఉంది. కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల నోటీసులు ఇచ్చిన సంగతి విదితమే. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా ఇచ్చిన సంగతి విదితమే.

15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# క్రీడలతో సానుకూల శక్తికి నిదర్శనం 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ (కేఐబీజీ)' ఇది సరికొత్త అధ్యాయం: ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మే 22:క్రీడలు సానుకూల శక్తినిస్తాయని, దేశ క్రీడా చరిత్రలో ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ కీలకమైన ఘట్టమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా, నాగర్ హవేలీ - డామన్, దయ్యూతోపాటు భారత క్రీడా ప్రాధికార సంస్థలోని క్రీడల నిర్వాహకులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సోమవారం తన సందేశాన్ని అందించారు. భారత క్రీడా ప్రస్థానంలో బీచ్ గేమ్స్ సంచలనం సృష్టిస్తాయని అభినందనలు చెప్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ వేదికగా దయ్యూను ఎంచుకోవడం 'సముచితం' అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "ఎండ, ఇసుక, నీటి సమ్మేళనమిది. అవి శారీరక సామర్థ్యానికి సవాళ్లను పెంచడంతోపాటు అదే సమయంలో తీర ప్రాంత వారసత్వ ప్రత్యేకతను చాటుతాయి" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "అలలు తీరాన్ని తాకుతూ, క్రీడాకారులు తలపడుతుండగా క్రీడా రంగంలో భారత్ ఓ సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది'' అని ఆయన వ్యాఖ్యానించారు.

నిరంతరం విస్తరిస్తున్న ఖేలో ఇండియా క్రీడల్లో భాగంగా బీచ్ గేమ్స్‌ను మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. ఈ క్రీడల వేదిక అయిన దయ్యూలోని ఘోఘ్లా బీచ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖల మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించారు.

ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,350 కి పైగా క్రీడాకారులను ఒకచోట చేర్చాయి. మే 24న పోటీలు ముగిసే సమయానికి అథ్లెట్లు తలపడే ఈ ఆరు క్రీడల్లో పతకాలు అందిస్తారు - సాకర్, వాలీబాల్, సెపక్ తక్రా, కబడ్డీ, పెన్‌కాక్ సిలాట్, ఓపెన్ వాటర్ స్విమ్మింగ్. మల్లఖంబ్, టగ్ ఆఫ్ వార్ రెండూ పతకేతర (ప్రదర్శన) విభాగం కిందకు వస్తాయి. సోమవారం ఉదయం బీచ్ సాకర్ పోటీ మొదలైంది.

"మనలాంటి వైవిధ్యభరితమైన దేశంలో సంస్కృతులు, ప్రాంతాలు, భాషలను ఏకం చేసే ప్రత్యేకమైన శక్తి క్రీడలకు ఉంది. కేవలం వినోదానికే పరిమితం కాదు.. క్రీడలతో లభించే ఉత్సాహవంతమైన శక్తి ప్రభావవంతమైన సానుకూల శక్తిగా నిలుస్తోంది. దేశ ప్రతిష్ఠకు, మన యువత ఆకాంక్షలకు క్రీడలు ప్రతీక. ఈ నేపథ్యంలో ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌కు అమితమైన ప్రాధాన్యముంది" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

అద్భుతమైన దేశ సాంప్రదాయక నృత్య రూపాల వైవిధ్యాన్ని చాటేలా, చక్కగా రూపొందించిన ప్రారంభోత్సవాన్ని అనేక మంది ప్రముఖులు వీక్షించారు. దాద్రా-నాగర్ హవేలీ, డామన్ - దయ్యూ, లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ ప్రఫుల్ పటేల్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ కె. కైలాశ్ నాథన్, అండమాన్ - నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె. జోషి పాల్గొన్నారు.

"ఈరోజు కేవలం ఓ క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించడం మాత్రమే కాదు, భారత మొదటి బీచ్ స్పోర్ట్ విప్లవాన్ని మనం చాటుతున్నాం! అలలతోపాటు ఆకాంక్షలు వెల్లివిరుస్తాయని, ఈ మట్టి ఉత్సాహాన్ని రగిలిస్తుందని నేను నమ్ముతున్నాను ? ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ నేడు మనందరి హృదయాల్లో ఒక ఉత్తేజాన్ని నింపాయి'' అని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ అన్నారు. "మోడీ ప్రభుత్వ హయాంలో మేము ఏ కార్యక్రమాన్నీ కేవలం లాంఛనప్రాయంగా నిర్వహించడం లేదు ? ఓ లక్ష్యంతో ముందుకెళున్నాం. క్రీడలను ఉపాధితో అనుసంధానం చేయడం మా లక్ష్యం. వికసిత భారత్ దిశగా.. యువత తమ కలలను సాకారం చేసుకోడానికి ఖేలో ఇండియా ఓ కచ్చితమైన మార్గం" అని ఆయన అన్నారు.

ఖేలో ఇండియా దేశీయ క్రీడా రంగంలో మరిన్ని క్రీడలను చేర్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నట్టు- గత కొన్నేళ్లుగా మౌలిక సదుపాయాలు, మెరుగైన శిక్షణ సౌకర్యాలు, క్రీడాకారులకు సహాయక చర్యల్లో పెట్టుబడుల ద్వారా క్రీడా రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ వివరించారు. 'దేశీయ క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ఏ స్థాయి అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలనైనా భారత్ నిర్వహించగలదని ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపడానికి' కొత్త క్రీడలు మంచి అవకాశమని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ వివరించారు.

ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌ను 'సాధారణ' వ్యవహారంగా చూడొద్దని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ అన్నారు. "బీచ్ వాలీబాల్ వంటి క్రీడలు ఓ అభిరుచిగా యువతను ఆకర్షించడమే కాకుండా, కెరీర్ అవకాశాలను కూడా వారికి అందిస్తాయి. దేశంలోని బీచ్‌లలో ఇంత పెద్ద ఎత్తున పోటీ క్రీడలను నిర్వహిస్తుండడం ఇదే తొలిసారి" అన్నారు.

భారత్‌లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతోందని, క్రీడా సంస్కృతి 'సరికొత్త నియమావళి'గా మారిందని డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. కేంద్రపాలిత ప్రాంతంపట్ల ప్రభుత్వానికి బలమైన నిబద్ధత ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

ఖేలో ఇండియా కింద నిర్వహిస్తున్న మొదటి బీచ్ గేమ్స్ ఇవి. దాద్రా, నాగర్ హవేలీ - డామన్ దయ్యూ కేంద్రపాలిత ప్రాంతం దయ్యూలో మే 19 నుంచి 24 వరకు ఖేలో ఇండియా పథకంలో భాగంగా క్రీడా పోటీలు, నైపుణ్యాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. బీచ్ క్రీడలను ప్రోత్సహించడంతోపాటు వాటిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ ఎడిషన్‌లో ఆరు క్రీడల్లో పోటీలు నిర్వహించి పతకాలను అందించనున్నారు: బీచ్ సాకర్, బీచ్ వాలీబాల్, బీచ్ సెపక్ తక్రా, బీచ్ కబడ్డీ, పెన్‌కాక్ సిలాట్, ఓపెన్ వాటర్ స్విమ్మింగ్. వీటితోపాటు మరో రెండు (పతకేతర) ప్రదర్శన క్రీడలు కూడా నిర్వహించనున్నారు: మల్లఖంబ్, టగ్ ఆఫ్ వార్ పోటీలను కూడా దయ్యూలో నిర్వహిస్తారు.

# లిక్కర్ స్కామ్ చంద్రబాబు సృష్టే - జగన్

అమరావతి, మే 22: వైసీపీ హయాంలో లిక్కర్ విషయంలో ఎలాంటి తప్పు జరగలేదని తేల్చేశారు మాజీ ముఖ్యమంత్రి జగన్. ఆయనకు ఆయనే క్లీన్‌చిట్ ఇచ్చుకున్నారు. తప్పంతా చేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని ఎదురుదాడి చేశారు.. తాడేపల్లిలోని ఆయన నివాసంలో నేడు మీడియాతో మాట్లాడుతూ, భయపెట్టి, బెదిరించి తప్పుడు సాక్షాలు సృష్టించి అరాచకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం తనను బెదిరిస్తుందని చెబుతూ ఏపీ బేవరేజెస్ మాజీ ఎంపీ వాసుదేవరెడ్డి హైకోర్టులో మూడుసార్లు పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2014-19 మధ్యకాలంలో లిక్కర్ స్కామ్‌లో చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారంటూ కొత్త విషయాన్ని బయటపెట్టారు.

బేవరేజెస్ కార్యకలాపాలకు రాజ్ కసిరెడ్డికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. అప్పటి ప్రభుత్వం సలహాదారుల్లో ఆయన కూడా ఒకరన్నారు. కేవలం రెండేళ్లు మాత్రమే ఆయన పని చేశారన్నారు. కూటమికి మేలు జరిగేలా విజయసాయిరెడ్డి వ్యవహరించారని ఆరోపించారు. విజయవాడ టీడీపీ ఎంపీతో రాజ్ కసిరెడ్డి వ్యాపారాలు ఉన్నాయంటూ కేశినేని నాని మాటలనే ప్రస్తావించారు. వారికి వ్యాపార సంబంధాలు ఉన్నాయని, పలు కంపెనీలకు డైరెక్టర్లుగా ఉన్నారని చెప్పుకొచ్చారు. తామంతా కలిస్తే గూగుల్ టేకేవర్ కు తెలీదా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి లిక్కర్ వ్యవహారంలో ఏం సంబంధం అని అన్నారు. లోక్‌సభలో ఆయన ఫ్లోర్ లీడర్ అని చెప్పారు. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డికి ఏం సంబంధముందని ప్రశ్నించారు. దానికి సంబంధించిన ఫైలుపై వారు సంతకం పెట్టలేదన్నారు.

ఆ ముగ్గురు మంచి అధికారులు వైసీపీ హయాంలో పని చేసిన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలు, పీఎస్ఆర్ ఆంజనేయలతోపాటు మరికొందరు మచ్చలేని అధికారులంటూ వారందర్నీ తీసుకొచ్చి జైలులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో లాటరీ పేరుతో లిక్కర్ షాపులు మంత్రులు, ఎమ్మెల్యేలకు అప్పగించారని తూర్పారబట్టారు. గతంలో చంద్రబాబుపై వచ్చిన ఆరోపణలను వాటిని తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో ఎప్పుడూ చూడని బ్రాండ్లు లేవా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వస్తే ధరలు ఎక్కడ తగ్గిస్తామని చెప్పారని, ఎక్కడ తగ్గించారని అన్నారు. ఎంఆర్పీ కన్నా ఎక్కువకు అమ్ముతున్నారని, అది స్కామ్ కాదా అని అన్నారు. 99 రూపాయలకు లిక్కర్ ఇచ్చి, దాని క్వాలిటీని తగ్గించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు.

## మోసాలతోనే కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసాలతో నడిచిందన్నారు జగన్. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలో 3.8శాతం మాత్రమే గ్రోత్ కనిపిస్తోందన్నారు. ఏడాది పాలనతో ప్రజల కొనుగోలు శక్తి, పెట్టుబడులు తగ్గాయని తెలిపారు. తమ పాలనలో చివరి ఏడాది రూ.67వేల కోట్ల అప్పులు చేశామని, చంద్రబాబు ఏడాది పాలనలో రూ.81వేల కోట్ల అప్పులు చేశారని ఆయన ఆరోపించారు. గతంలో అమరావతి పనుల కోసం 2018లో టెండర్లు పిలిచారని, ఆనాడు ఖరారైన టెండర్ల విలువ అక్షరాలా రూ.41,170 కోట్లని వివరించారు మాజీ సీఎం జగన్. చంద్రబాబు పూర్తి చేసిన పనులు మినహా రూ.35 వేల కోట్లతో పనులు చేయాల్సి ఉందన్నారు. ఆ టెండర్లను రద్దు చేసి, మిగిలిన పనుల అంచనాలు అమాంతం పెంచేసి దోపిడీ చేస్తున్నారని అన్నారు.

## చంద్రబాబుకు లొంగిపోయిన విజయసాయి

తమ పార్టీ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకి లొంగిపోయారని ఆరోపించారు జగన్. కూటమికి మేలు చేసేందుకు పదవీకాలం ఉండగానే రాజ్యసభకు ఆయన రాజీనామా చేశారన్నారు. వైసీపీకి ఎమ్మెల్యేల బలం లేదని భావించి, రాజ్యసభకు వంపదని తెలిసి రాజీనామా చేశారన్నారు. ప్రలోభాలకు లోనై ఆ సీటును అమ్మేశారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇచ్చిన స్టేట్‌మెంట్లకు ఏం విలువ ఉంటుందని అన్నారు.

## జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినం.. నిరసన కార్యక్రమాలు

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని జగన్ స్పష్టం చేశారు ఈ క్రమంలో.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తేదీ జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామని ప్రకటించారాయన. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా నిర్వహిస్తాం.

# ఎపికి చేరుకున్న కుంకీ ఏనుగులు..పవన్ ను అభినందించిన లోకేష్..

**-చిత్తూరు జిల్లాకు చేరుకున్న కుంకీ ఏనుగులు**
**-బెంగళూరు నుంచి లారీల్లో తరలించిన అధికారులు**
**-పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంప్‌కు రెండు**
**-తిరుపతి జూపార్క్‌కు రెండు కుంకీ ఏనుగుల తరలింపు**

తిరుపతి, 22:బెంగళూరులోని విధానసౌధ వద్ద నిన్న జరిగిన కార్యక్రమంలో ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కు నాలుగు కుంకీ ఏనుగుల అప్పగించారు కర్ణాటక



సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ సందర్భంగా గజ పూజ అనంతరం కర్ణాటక అధికారులు జెండా ఊపి కుంకీ ఏనుగులను సాగనంపగా.. డిప్యూటీ సీఎం పవన్ పూలుజల్లి ఆ ఏనుగులను స్వాగతించారు. కుంకీ ఏనుగులు కృష్ణ (15 ఏళ్లు) అభిమన్యు(14), దేవా (39), రంజన్ (26)లను కర్ణాటక అధికారులు ప్రత్యేక లారీలలో ఏపికి పంపారు ఆ నాలుగు ఏనుగులు నేడు పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంప్‌కు చేరుకున్నాయి.. వాటిలో రెండు ఏనుగులను తిరుపతి జూ పార్క్ కు తరలించారు.. త్వరలోనే మరో రెండు ఏనుగుల రానున్నాయి..

ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సోదరుల కష్టాలకు పరిష్కారం చూపేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపడంపై మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'వపనన్నకు శుభాభినందనలు' అంటూ ట్వీట్ చేశారు. ఏనుగుల విధ్వంసంతో నష్టపోతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించిన ఉప ముఖ్యమంత్రికి, అడగగానే కుంకీ ఏనుగులను అప్పగించిన కర్ణాటక ప్రభుత్వానికి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ట్విట్ చేశారు..

ఇక యువగళం పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి నారా లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఏనుగుల విధ్వంసంతో పంటలు నష్టపోతున్నామని రైతు సోదరులు తమ ఆవేదన వ్యక్తం చేశారని ఆయన అన్నారు. రైతుల కష్టాలకు చెక్ పెట్టేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవచూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారని తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : ఈసంపల్లి బాబు



వరంగల్, మే 22:తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు అన్నారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్లో పండిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తీసుకోవడం లో జాప్యం చేస్తుందన్నారు. జిల్లాలో లక్షా పదివేల ఎకరాల వరి పంటను రైతులు పండించారని, కాని ఇప్పటి వరకు లక్షా 15 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు లేవని, అలాగే సరియైన సమయంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ సరిగా లేదని విమర్శించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయిందని, కొంతమంది రైతుల ధాన్యం కుప్పలు వరద నీటిలో కొట్టుకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రులు తడిసిన ధాన్యాన్ని ఖరీద్ చేస్తామని చెప్తున్నప్పటికి క్షేత్రస్థాయి అధికారులు రైతాంగానికి భరోసా కల్పించుటలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రైతాంగానికి భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, జిల్లా నాయకులు ముంజల సాయిలు, కోడెం రమేష్, పాత్కాల సుధాకర్, పొన్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

# 78వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో ప్రపంచ ఆరోగ్య వాగ్దానాన్ని పునరుద్ఘాటించిన భారత్

న్యూఢిల్లీ, మే 22:వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 78వ సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి భారత్ ఈ రోజు ప్రసంగించింది. "వన్ వరల్డ్ ఫర్ హెల్త్'' ఇతివృత్తంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సమానత్వానికి తన నిబద్ధతను ఇండియా పునరుద్ఘాటించింది. భారత ప్రతినిధి వర్గం పక్షాన కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులకు అభినందనలు తెలపడంతోపాటు అర్థవంతమైన అంతర్జాతీయ స్థాయి సంభాషణ, సహకారాలకు ఒక వేదికను సమకూర్చడాన్ని స్వాగతించారు.

ప్రపంచంలో అందరి ఆరోగ్యాన్నీ సంరక్షించాలనే అంశానికి భారత్ కట్టుబడి ఉందని శ్రీమతి శ్రీవాస్తవ చెబుతూ... ఆయుష్మాన్ భారత్ వంటి ప్రధాన కార్యక్రమాలను అమలులోకి తీసుకు రావడం ద్వారా గణనీయ మార్పుల దిశలో అడుగులు వేసినట్లు స్పష్టం చేశారు. ఆయుష్మాన్ భారత్ సంపూర్ణ ఆరోగ్యసంరక్షణ లభ్యత పరిధిని ఎంతో విస్తరించిందని ఆమె చెప్పారు. "ఈ కార్యక్రమం సంపూర్ణ ఆరోగ్యసంరక్షణని విస్తరించింది. ఆధునిక వైద్యచికిత్సలకు ఆర్థిక సాయాన్ని అందించింది. ఆరోగ్య రంగంలో డిజిటల్ మాధ్యమ ఆధారిత సేవల వినియోగాన్ని వేగవంతం చేసింది. అందరికీ ఆరోగ్య సేవల లక్ష్య సాధనకు ఇది బాటను వేసింది" అని ఆమె వివరించారు.

ప్రసూతి కాల ఆరోగ్యసంరక్షణ, కుటుంబ నియంత్రణ, శిశు మరణాలు, మృతశిశు జననాల తగ్గింపు.. ఈ అంశాల్లో భారత్ నడుం బిగించి చేస్తున్న కృషిని ఐక్య రాజ్య సమితి పాప్యులేషన్ ఫండ్, యూఎన్ ఇంటర్-ఏజెన్సీ గ్రూపులు సహా ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తించాయని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి ప్రధానంగా ప్రస్తావించారు. "భారత్ ట్రకోమా జాడ లేని దేశం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇటీవల ధ్రువీకరించింది. మా దేశం క్షయ, కుష్ఠు, లింఫాటిక్ ఫైలేరియాసిస్ (బోదకాలు వ్యాధి) , మశూచి, రూబెలా (జర్మన్ మీజిల్స్ లేదా పొంగు), కాలా-అజార్ (విషపాండు జ్వరం) వంటి వ్యాధుల నిర్మూలనకు కట్టుబడి ఉంది'' అని ఆమె వెల్లడించారు.

భారత్ ఒక ప్రధాన విధాన నిర్ణయాన్ని తీసుకొని, దేశంలో 70 ఏళ్ల వయస్సు పైబడిన పౌరులందరికీ వారి ఆర్థిక స్థితి ఎలాంటిదయినప్పటికీ 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన'లో భాగంగా వారికి ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆమె తెలిపారు. "భవిష్యత్తు కాలంలో ఆరోగ్యసంరక్షణ రంగ వృత్తినిపుణులు కాబోయేవారికి తగ్గ శిక్షణను ఇవ్వడానికి మేం గత పదేళ్లలో వైద్య కళాశాలల సంఖ్యను రెట్టింపు చేసి, 387 నుంచి 780కి చేర్చాం" అని ఆమె చెప్పారు.

దేశాల సార్వభౌమత్వాన్ని, సామర్థ్యాలను గౌరవిస్తూనే ప్రపంచ స్థాయిలో సహకారాన్ని పెంపొందించే చట్టబద్ధ, విధాన రూపకల్పనను భారత్ గట్టిగా సమర్థిస్తుందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పునరుద్ఘాటించారు. "వైద్యపరంగా తీసుకోవాల్సిన చర్యలు అన్ని దేశాలకూ సమానంగా అందేటట్టు, సమాచారంతో పాటు వ్యాధికారకాల గురించి వివరాల్ని సరైన సమయంలో, పారదర్శకంగా వెల్లడించేలా ప్యాండమిక్ అగ్రిమెంటు రూపొందాలి... సాంకేతికతను పంచుకోవడంతో పాటు సామర్థ్యాల పెంపును ముఖ్యంగా గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల్లో) ప్రోత్సహించాలి" అని ఆమె అన్నారు.

ప్యాండమిక్ ట్రీటీ (మహమ్మారి ప్రభావాన్ని తగ్గించడంపై ఒప్పందం) త్వరలోనే ఖాయం అయ్యే దిశగా చరిత్రాత్మక పురోగతిని నమోదు చేసినందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థకు, సభ్య దేశాలకు ఆమె అభినందనలు తెలిపారు. రాబోయే కాలంలో ఆరోగ్య రంగానికి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికీ, ఈ క్రమంలో ఎవరినీ వదలివేయకుండా చూడాలన్న నిబద్ధతను కొనసాగించాల్సి ఉందని కూడా ఆమె స్పష్టం చేశారు.

# గ్రామీణ మహిళలకు ఉపాధిని కల్పించిన ఫైజర్ - గీతం విశ్వవిద్యాలయం



విశాఖపట్నం, మే 22: ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి, విశాఖపట్నంలోని ఫైజర్ గ్లోబల్ సప్లై తయారీ యూనిట్, విశాఖపట్నంలోని గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (గీతం) విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం చేసుకుంది.

వీరంతా ఫైజర్ అటానమస్ టీమ్స్ (పీఏటీ) కార్యక్రమంలో భాగంగా మహిళా సహోద్యోగుల మొదటి బ్యాచ్ గ్రాడ్యుయేషన్ ను ప్రకటించారు. ఈ 36నెలల కార్యక్రమంలో భాగంగా అట్టడుగు స్థాయిలోని మహిళలకు ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

సైన్స్ సంబంధిత రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా ఫైజర్, గీతం విశ్వవిద్యాలయం మధ్య ఈ పరిశ్రమ ? విద్యా భాగస్వామ్యంలో భాగంగా చేపట్టిన ఫైజర్ అటానమస్ టీమ్స్ అనే కార్యక్రమం అభ్యసిస్తూనే సంపాదించే అవకాశాన్ని కల్పిస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా, స్థానిక మహిళా విద్యార్థులను తమ తయారీ యూనిట్ సిబ్బందితో చేరడానికి ఫైజర్ అవకాశం కల్పించింది. అదే సమయంలో గీతం విశ్వవిద్యాలయంలో వారి విద్యను కొనసాగించడానికి తగిన మద్దతు లభిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 44మంది మహిళా విద్యార్థులతో కూడిన మొదటి బృందం, మైక్రోబయాలజీలో ప్రత్యేకత కలిగిన బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు.

పీఏటీ విద్యార్థులందరూ మొదటి రోజు నుండి ఫైజర్ ఉద్యోగులుగా ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు ఇప్పుడు పూర్తిగా తమ ఉద్యోగాల్లోకి చేరుతున్నందున ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ప్రస్తుతం, విశాఖపట్నంలోని ఫైజర్ తయారీ యూనిట్లో 340మందికి పైగా మహిళా విద్యార్థులు పీఏటీ ప్రోగ్రామ్లో భాగమయ్యారు.

ఈ కార్యక్రమం గురించి ఫైజర్ వైస్ ప్రెసిడెంట్ (సైట్ హెడ్) బీ.మురళీధర్ శర్మ మాట్లాడుతూ ఫైజర్ అటానమస్ టీమ్స్(పీఏటీ) ప్రోగ్రామ్ నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని తమ సిబ్బందితో చేరిన మొదటి బ్యాచ్ విద్యార్థులను చూడటం చాలా ఆనందంగా ఉందన్నారు.

గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ పని, సాధారణ విద్య మధ్య సమతుల్యత అనేది విద్యార్థుల ధైర్యానికి మాత్రమే కాదు, అందరి ధైర్యసాహసాలకు నిదర్శనమని, విద్యాభ్యాసాన్ని ఆచరణాత్మక పరిశ్రమ అనుభవంతో కలపడం ద్వారా, ఈ కార్యక్రమం విద్యా - పరిశ్రమ సహకారం యొక్క శక్తిని ప్రదర్శిస్తుందన్నారు.

ఈ కార్యక్రమానికి ఆసియా - పసిఫిక్ , ఆఫ్రికా అండ్ మిడిల్ ఈస్ట్ రీజియన్లోని పీపుల్ ఎక్స్ పీరియన్స్, ఫైజర్ గ్లోబల్ సప్లై సీనియర్ డైరెక్టర్ రేష్మా పరిదా ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఎస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.వేదవతి, పీజీఎస్ ఇండియా పీపుల్ ఎక్స్ పీరియన్స్ డైరెక్టర్ టీ.రవికిరణ్ కూడా హాజరయ్యారు.

# లారీ యజమానులకు గుడ్ న్యూస్ -హరిత పన్ను తగ్గింపు

అమరావతి, మే 22: ఏపీలో ఎన్నికలకు ముందు లారీ యజమానుల సంఘాలతో జరిగిన పలు భేటీల్లో కూటమి హరిత పన్ను తగ్గిస్తామని హామీ ఇచ్చింది. తాజాగా ఈ పన్నును తగ్గిస్తున్నట్లు ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గతంలో వాహనదారులు గరిష్టంగా ఏటా రూ.20 వేల వరకు హరిత పన్నును చెల్లించేవారు. కేబినెట్ నిర్ణయంతో ఇకపై 7-12 ఏళ్ల వాహనాలకు ఏడాదికి రూ.1,500, అలాగే 12 ఏళ్లు దాటిన వాహనాలకు రూ.3 వేల హరిత పన్నును ప్రభుత్వం వసూలు చేయనుంది.

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి..

**-ప్రాధాన్యత రంగాలల్లో రుణాల పంపిణీ మరింత పెంచాలి**
**-డిజిటల్ గ్రామాల తయారీకి సమగ్ర కార్యాచరణ రూపొందించాలి**
**-బ్యాంకర్లతో డీసీసీ డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించిన కలెక్టర్**

కరీంనగర్, మే 22: ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను



ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో అయన గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ తో కలిసి బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఇంటి రుణాలు, విద్యా రుణాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రుణాల పంపిణీ తగ్గడానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు తగ్గకుండా చూడాలని, జిల్లాలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని అందులో 15 రోజుల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ లావాదేవీలు వినియోగించేలా చూడాలని, ప్రభుత్వం తరపున అందే పథకాలు కూడా ఆన్ లైన్ లో లబ్ధిదారులకు అందేలా చూడాలని అన్నారు.

2024-25 లో జిల్లాలోని రైతులకు పంట రుణాల క్రింద 1864 కోట్లు పంపిణీ లక్ష్యానికి గాను రూ.1358 కోట్ల పంపిణీ చేశామని, వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీ కు నిర్దేశించిన లక్ష్యం చేరుకున్నామని, ఇదే దిశగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. 2025-26 సంవత్సరంలో రైతులకు అందించే స్కేల్ ఆఫ్ లోన్ డిస్ట్రిబ్యూషన్ పెంచాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీ పై దృష్టి సారించాలని అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు వ్యవసాయ టర్మ్ రుణాల లక్ష్యాల సాధనలో వెనుకబడిందని, ఈ సంవత్సరం మెరుగ్గా రుణాలు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

ఎంఎస్ఎంఈలకు. 2024-25 లో రూ.1364 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా రూ.951 కోట్ల రుణం పంపిణీ చేసినట్లు చెప్పారు. 5 వేల 844 స్వశక్తి సంఘాలకు 469 కోట్ల 37 లక్షలు బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

# సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

**– సీఎం కు ఘనంగా స్వాగతం పలుకుదాం**

**– వైద్య ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



సంగారెడ్డి మే 22(నేటి నిజం ప్రతినిది) ఈనెల 23 న సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి అయినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు.

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కార్ ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, శాసనసభ్యులు సంజీవరెడ్డి తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

హెలిపాడ్ ను,సీఎం చేతుల మీదుగా ప్రారంభించే బసవేశ్వర విగ్రహం, నిమ్జ్ రోడ్, కేంద్రీయ విద్యాలయ భవనం,సభ స్థలంను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ వేదిక, వి ఐ పి గ్యాలరీ, మీడియా గ్యాలరీ ,వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్ అన్ని పనులు పూర్తి అయ్యాయన్నారు.సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎస్పీ పంకజ్ పరితోష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

# గోవాలో నిర్మించనున్న ప్రతిష్మాత్మక అబ్జర్వేటరీ టవర్లకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన

న్యూఢిల్లీ, మే 22:గోవాలో జువారీ వంతెనపై నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక అబ్జర్వేటరీ టవర్లకు శుక్రవారం (2025, మే 23) కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ భూమిపూజ చేస్తారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, శ్రీ నితిన్ గడ్కరీ మార్గదర్శక చొరవ, గోవా ముఖ్యమంత్రి శ్రీ ప్రమోద్ సావంత్ అంకితభావంతో చేసిన కృషి కారణంగా ఇది సాధ్యమైంది.

ఈ ప్రాజెక్టు విలువను రూ. 270.07 కోట్లుగా అంచనా వేశారు. ఐదేళ్ల కాల వ్యవధిలో దీని నిర్మాణం పూర్తి చేస్తారు. ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్ స్ఫూర్తితో ఈ అబ్జర్వేటరీ టవర్లను నిర్మిస్తున్నారు. రివోల్వింగ్ రెస్టారెంట్, ఆర్ట్ గ్యాలరీతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా వీటిని రూపొందించనున్నారు. గోవాలోని పర్యాటక ప్రదేశాల్లో ఇది ప్రముఖంగా నిలుస్తుంది.

ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా డీబీఎఫ్ఓటీ (నమూనా, నిర్మాణం, నిధులు, నిర్వహణ, బదిలీ) విధానంలో ఈ టవర్లను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తి చేయడంలోనూ, నిర్వహణలోనూ గుత్తేదారుదే పూర్తి బాధ్యత. 50 ఏళ్ల రాయితీ కాలానికి గుత్తేదారు ఈ టవర్లను నిర్వహిస్తారు. రెండు పైల్ క్యాప్ పునాదులపై 125 మీటర్ల ఎత్తులో ఈ టవర్ల నిర్మాణం చేపడతారు. స్థంభాల కొలతలు 8.50 మీ చీ 5.50 మీ. గా ఉంటాయి.

పై భాగాన 22.50మీ. చీ 17.80 మీ. కొలతల్లో రెండు విశాలమైన అంతస్థులు ఉంటాయి. వీటిని చేరుకోవడానికి క్యాప్సూల్ లిఫ్టులు ఏర్పాటు చేశారు. గ్యాలరీలు, కెఫెటేరియాలు, అత్యాధునిక పర్యాటక సౌకర్యాలతో కూడిన ఈ టవర్లు పర్యాటకులకు మరచిపోలేని అనుభవాన్ని ఇస్తాయి. పర్యాటకుల రాకపోకలు సాగించడానికి వీలుగా నదికి ఇరువైపులా 7.50 మీటర్ల వెడల్పుతో నడక వంతెనను నిర్మిస్తారు. సందర్శకుల సౌకర్యార్థం బ్రిడ్జికి ఇరువైపులా పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు.

ఈ ప్రాజెక్టు గోవాలో పర్యాటకాన్ని, ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలను సృష్టించి, దేశంలో అంతర్జాతీయ స్థాయి మౌలికవసతులను మెరుగుపరుస్తుంది. స్థానికంగా ఆతిథ్యం, రవాణా, రీటైల్ రంగాల్లో ఔత్సాహిక పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా, ఆర్కిటెక్చరల్ టూరిజం, అనుభవపూర్వక ప్రయాణానికి ప్రధాన గమ్యస్థానంగా గోవాను మారుస్తుంది.

# రైల్వేలు మన ఆర్థిక వ్యవస్థలో, మన గుర్తింపులో ఓ భాగం: కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని

న్యూఢిల్లీ, మే 22:భారతీయ రైల్వేలు మన ఆర్థిక వ్యవస్థలో భాగం మాత్రమే కాదనీ, మన గుర్తింపులోనూ ఒక భాగమేనని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరభివృద్ధి పనులు పూర్తి అయిన ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్ళూరుపేట రైల్వే స్టేషనును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ఈ రోజు ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడారు. భారతీయ రైల్వేలు ప్రతి రోజూ రెండు కోట్ల మందికి పైగా ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయనీ, అంతేకాకుండా ప్రపంచంలో చాలా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న యాజమాన్య సంస్థ కూడా భారతీయ రైల్వేలనీ మంత్రి అన్నారు.

ప్రస్తుతం భారత్‌లో మౌలిక సదుపాయాల కల్పన అంటే అది ఒక్క సౌకర్యాల గురించే కాదనీ, అది విశ్వాసాన్ని పెంపొందించడం గురించి కూడానని మంత్రి వ్యాఖ్యానించారు. మనకు సులభంగా చేరుకోగలిగే, సమర్థమైన, మన దేశ గౌరవానికి అద్దం పట్టే స్టేషన్లు అవసరమని చెప్పారు. "గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, రైల్వేలకు భారత అభివృద్ధి కార్యక్రమాల పట్టికలో కీలక స్థానాన్ని ఇచ్చాం. ఆయన విధానం స్పష్టం. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలలో మార్పు తీసుకురావాలి. ప్రయాణికులకు కలిగే అనుభూతులను పెంపొందించాలి. రైల్వే స్టేషన్లను మన దేశ పట్టణ ప్రాంత పునరుద్ధరణ కృషితో అనుసంధానించాలి" అని మంత్రి వివరించారు.

దేశంలో 1,300కు పైగా స్టేషన్లకు సరికొత్త రూపురేఖలను కల్పించాలనే ఉద్దేశంతో అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని రూపొందించినట్లు శ్రీ పెమ్మసాని తెలిపారు. రూ.14.5 కోట్ల ఖర్చుతో సూళ్ళూరుపేట రైల్వే స్టేషన్ పునరభివృద్ధి పనులను చేశారని తెలిపారు. ఈ స్టేషన్ పవిత్రమైన తిరుపతి జిల్లాలో ఉండడంతో భారతీయ రైల్వే చిత్రపటంలో ఈ స్టేషనుకు తనదైన ప్రత్యేక స్థానం ఉంది. అదీకాక, మన దేశంలో ప్రధాన స్పేస్‌పోర్టు అయిన శ్రీహరికోటకు చాలా దగ్గరగా ఉన్నరైల్వేస్టేషన్ కూడా సూళ్లూరుపేటయే.

గత 11 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన వివిధ రైల్వే ప్రాజెక్టులను గురించి మంత్రి ప్రస్తావిస్తూ... 2025?26లో బడ్జెటు కేటాయింపు రూ.9,417 కోట్లకు పెరిగిందనీ, ఇది 2009?14లో కేటాయించిన దాని కన్నా 10 రెట్లకు పైగానే అనీ తెలిపారు. మొత్తం 414 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాలను జోడించారనీ, 1,217 కి.మీ. మేర రైలుమార్గాల డబ్లింగ్ పూర్తి చేశారనీ, మొత్తం 3,748 కి.మీ. మేర రైలుమార్గాన్ని విద్యుదీకరించారన్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీము ఒక్క దానిలో భాగంగానే, ఆంధ్ర ప్రదేశ్‌లో 73 స్టేషన్ల పునరభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఇదొక రికార్డనీ మంత్రి చెప్పారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం : ఎమ్మెల్సీ యాదవరెడ్డి



మెదక్, 22:అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే రైతుల నుండి కొనుగోలు చేసి అక్కడి నుండి మిల్లులకు తరలించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం ధర్మారెడ్డి పల్లి, మూత్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మహిళ రైతులతో మాట్లాడి కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల్లోగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అక్కడ నుండి తరలించని పక్షంలో రాజీవ్ రహదారిపై ధాన్యం ట్రాక్టర్లతో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో రాష్ట్రంలో వరి దిగుబడి పెరిగిందని, కొనుగోలు చేయడంతో ప్రభుత్వం విఫలమయిందన్నారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక చేతులెత్తేశారని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదు కోవడంతో ప్రభుత్వం విఫమయిందని విమర్శించారు.

రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మిస్తే అది జీర్ణించుకోలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షకట్టి అవినీతి మచ్చ వేస్తు నోటీసులు పంపడం సిగ్గుచేటన్నారు. కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.రైతులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో సాగు విస్తీర్ణం పెంచాలనే ఆలోచనతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం కేసీఆర్ చేసిన తప్పా అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో ఆ పార్టీ నేతలను ప్రజలే చీపుర్లతో నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెజాల వెంకటేశంగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గుంటుకు రాజు, నర్సింగరావు, కనకయ్య, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లోని బికనీర్‌లో రూ.26,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, మే 22:ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ రోజు రాజస్థానలోని బికనీర్‌లో రూ.26,000 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పనులు పూర్తయిన వాటిని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన వారినీ, అలాగే 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఆన్‌లైన్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నవారినీ స్వాగతించారు. వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ప్రజాప్రతినిధుల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరైన విశిష్ట అతిథులకు, పౌరులకు అభినందనలు తెలియజేశారు.

కర్ణిమాత ఆశీస్సులు తీసుకున్న అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చినట్లు శ్రీ మోదీ తెలిపారు. ఈ ఆశీస్సులు అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే దేశ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ రోజు శంకుస్థాపన చేసిన, ప్రారభించిన రూ. 26,000 కోట్ల విలువైన అభివృద్ధి పనుల గురించి మాట్లాడారు. దేశ ప్రగతిని ముందుకు తీసుకెళ్లడంలో వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ పరివర్తనాత్మక కార్యక్రమాలకు గాను ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భారత మౌలిక వసతుల్లో వస్తున్న మార్పులను ప్రస్తావిస్తూ.. ఆధునికీకరణ అంశంలో దేశం నిబద్ధతతో ఉందని స్పష్టం చేశారు. గత 11 ఏళ్లలో రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వేలు, రైల్వే స్టేషన్లలో వచ్చిన వేగవంతమైన పురోగతి గురించి వివరించారు. "గతంతో పోలిస్తే మౌలిక వసతుల అభివృద్ధికి ఇప్పుడు భారత్ ఆరు రెట్లు ఎక్కువగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ప్రగతి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది" అని ప్రధాని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల గురించి వివరించారు. ఉత్తరాన చీనాబ్ వంతెన, తూర్పున అరుణాచల్ ప్రదేశ్‌లోని సేలా సొరంగం, అస్సాంలోని బోగీబీల్ వంతెన, పశ్చిమాన ముంబయిలో అటల్ సేతు, దక్షిణాన దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ సీ లిఫ్ట్ ను నిర్మించిన పంబన్ బ్రిడ్జిని ఉదాహరణలుగా పేర్కొన్నారు.

రైల్వే వ్యవస్థను ఆధునికీకరించేందుకు భారత్ చేపడుతున్న నిరంతర ప్రయత్నాల గురించి శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. దేశంలో ప్రారంభమైన వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు.. దేశ వేగానికి, అభివృద్ధికి చిహ్నాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దాదాపుగా 70 మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, మారుమూల ప్రాంతాలకు సైతం ఆధునిక రైల్వే అనుసంధానాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వందల సంఖ్యలో రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, 34,000 కి.మీలకు పైగా కొత్త రైల్వే ట్రాకులను వేయడంతో సహా గత 11 ఏళ్లుగా మౌలిక వసతుల కల్పనలో సాధించిన గణనీయమైన పురోగతి గురించి ప్రధాని వివరించారు. బ్రాడ్ గేజ్ లైన్లపై మానవ రహిత లెవెల్ క్రాసింగ్‌లను తొలగించడం వల్ల భద్రత పెరిగిందని ఆయన అన్నారు. దేశంలో కార్గో రవాణాను క్రమబద్ధీకరించడానికి ప్రత్యేకంగా సరకు రవాణా కారిడార్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టును వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రయత్నాలకు తోడుగా 1,300 కంటే ఎక్కువ రైల్వే స్టేషన్లను ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునికీకరిస్తున్నామని తెలిపారు.

ఆధునికీకరించిన రైల్వేస్టేషన్లకు అమృత్ భారత్ స్టేషన్లుగా పేరు పెట్టామని, అలాంటి 100కి పైగా స్టేషన్లలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్థానిక కళలు, చరిత్రను ప్రతిబింబించేలా ఈ స్టేషన్లలో వచ్చిన అద్భుతమైన మార్పులను సామాజిక మాధ్యమ వినియోగదారులు చూశారని ఆయన పేర్కొన్నారు. దీనికి కొన్ని ఉదాహరణలను ఆయన చూపించారు. రాజస్థాన్‌లోని మండల్‌గఢ్ స్టేషన్ రాజపుత్ర సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. బీహార్లోని థావే స్టేషన్ థావేవాలీ మాత పవిత్ర ఉనికిని, మధుబని కళను ప్రదర్శిస్తుందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఊర్చా రైల్వే స్టేషన్ భగవాన్ రాముని దైవిక సారాన్ని తెలియజేస్తుందని, శ్రీరంగం రైల్వే స్టేషన్ నమూనాను శ్రీ రంగనాథ స్వామి ఆలయం నుంచి స్వీకరించామన్నారు. గుజరాత్‌లోని డకోర్ స్టేషన్ రణ్‌ఛోడ్రాయ్ జీకి నివాళులు అర్పిస్తుంది. తిరువణ్ణామలై స్టేషన్ ద్రావిడ నిర్మాణ శైలిని అనుసరిస్తుంది. బేగంపేట రైల్వే స్టేషన్ కాకతీయ రాజవంశ నిర్మాణ వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధాని వెల్లడించారు. వేల ఏళ్ల నాటి భారత దేశ వారసత్వాన్ని ప్రదర్శించడమే కాకుండా, రాష్ట్రాల్లో పర్యాటక రంగ వృద్ధికి ఉత్ప్రేరకంగా ఈ అమృత్ భారత్ స్టేషన్లు పనిచేస్తాయని, యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ స్టేషన్ల పరిశుభ్రతకు, భద్రతకు ప్రజలు సహకరించాలని, ఈ మౌలిక వసతులకు వారే యజమానులని అన్నారు.

మౌలిక వసతుల్లో ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడులు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మాత్రమే కాకుండా.. ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, వ్యాపార కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని శ్రీ మోదీ అన్నారు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న వేల కోట్ల రూపాయలు.. కార్మికులు, దుకాణదారులు, పరిశ్రమల్లో ఉద్యోగులతో పాటుగా ట్రక్కులు, టెంపో ఆపరేటర్లు లాంటి రవాణా రంగంతో ముడిపడిన వారికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మౌలిక వసతుల ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. రైతులు తక్కువ ఖర్చుతో పంట దిగుబడులను సమీప మార్కెట్లకు తరలించి, వృథాను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. బాగా అభివృద్ధి చేసిన రోడ్లు, విస్తరించిన రైల్వే వ్యవస్థ కొత్త పరిశ్రమలను ఆకర్షిస్తాయని, పర్యాటకాన్ని గణనీయంగా మెరుగుపరుస్తాయని ఆయన అన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం చేసే ఖర్చులు వల్ల ప్రతి ఇంటికీ ప్రయోజనం కలుగుతుంది. యువతకు నూతన ఆర్థిక అవకాశాల వల్ల ప్రయోజనం చేకూరుతుందని శ్రీ మోదీ తెలిపారు.

రాజస్థాన్‌లో కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఆ రాష్ట్రం గణనీయమైన ప్రయోజనాన్ని పొందుతోందని శ్రీ మోదీ అన్నారు. గ్రామాలు, సరిహద్దు ప్రాంతాల్లో అత్యంత నాణ్యత కలిగిన రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. గడచిన పదకొండేళ్లలో ఒక్క రాజస్థాన్‌లోనే రోడ్ల నిర్మాణానికి దాదాపుగా రూ. 70,000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అలాగే ఈ రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి ఈ ఏడాది రూ. 10,000 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుందని వెల్లడించారు. ఇది 2014కి ముందున్న కాలంతో పోలిస్తే.. ప్రస్తుతం 15 రెట్లు ఎక్కువగా పెరిగిందని తెలిపారు. బికనీర్ నుంచి ముంబయికి వెళ్లే కొత్త రైలుని ప్రారంభించడం ద్వారా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచినట్లు తెలిపారు. వీటికి అదనంగా, వివిధ ప్రాంతాల్లో ఆరోగ్యం, నీరు, విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించామని, భూమిపూజ చేశామన్నారు. రాజస్థానలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల పురోగతిని వేగవంతం చేయడమే కాకుండా.. యువతకు తమ సొంత నగరాలు, పట్టణాల్లోనే అవకాశాలను పొందేలా చేయడమే ఈ కార్యక్రమాల లక్ష్యం అని తెలియజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో పారిశ్రామిక అభివృద్ధి శీఘ్రతరం అయిన సంగతిని ప్రధాని స్పష్టం చేస్తూ, ముఖ్యమంత్రి శ్రీ భజన్‌లాల్ శర్మ పాలనయంత్రాంగం వివిధ రంగాల్లో కొత్త పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టిందనీ, ఇవి బికనేర్ వంటి ప్రాంతాలకు మేలు చేస్తాయన్నారు. బికనేర్ భుజియా, బికనేరీ రసగుల్లాలు ప్రపంచంలో వాటి గుర్తింపును విస్తరింప చేసుకొని, రాష్ట్ర ఆహార శుద్ధి పరిశ్రమను మరింత పటిష్ఠంగా మారుస్తాయని ఆయన ప్రధానంగా చెప్పారు. రాజస్థాన్ రిఫైనరీ ప్రాజెక్టు చివరి దశలకు చేరుకొంటోందనీ, ఇది రాష్ట్రాన్ని పెట్రోలియం ఆధారిత పరిశ్రమలకు ఒక కీలక కూడలిగా నిలపనుందన్నారు. అమృత్‌సర్ నుంచి జామ్‌నగర్ వరకు ఆరు దారుల ఆర్థిక నడవా (ఎకనామిక్ కారిడార్)కు ఉన్న ప్రాముఖ్యం ఎంతటిదో కూడా ఆయన వివరించారు. ఈ నడవా శ్రీ గంగానగర్, హనుమాన్‌గఢ్, బికనేర్, జోధ్‌పూర్, బాడ్‌మేర్‌లతో పాటు జలోర్ గుండా సాగుతోందన్నారు. దీనికి తోడు, ఈ రాష్ట్రంలో ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని ఆయన చెబుతూ, ఈ సంధాన ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని కొత్త శిఖరాలకు చేరుస్తాయన్నారు.

'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్‌లీ యోజన' రాజస్థాన్‌లో శరవేగంగా అమలవుతోందని శ్రీ మోదీ ప్రధానంగా చెప్పారు. రాష్ట్రంలో 40,000 మందికి పైగా ప్రజలు ఇప్పటికే ఈ పథకం ప్రయోజనాలను అందుకొన్నారనీ, దీంతో విద్యుత్తు బిల్లులు అంతరించి, సౌర విద్యుత్తు మాధ్యమం ద్వారా ఆదాయాన్ని ఆర్జించే అవకాశాన్ని ప్రజలకు అందించిందన్నారు. విద్యుత్తుకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగిన సంగతిని ఆయన తెలియజేస్తూ, ఈ సంఘటనలు రాజస్థాన్‌లో విద్యుత్తు సరఫరాను మరింత పెంచుతాయన్నారు.

రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పాదనను పెంచడంతో, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడంలో కీలక పాత్రను ఇది పోషిస్తోందని ఆయన తెలిపారు.

రాజస్థాన్‌కున్న చారిత్రక ప్రాముఖ్యాన్ని శ్రీ మోదీ చెబుతూ, ఎడారి ప్రాంతాన్ని సారవంతమైన మైదానంగా మార్చడంలో మహారాజా గంగా సింగ్ దూరదృష్టితో చేపట్టిన ప్రయత్నాలను గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో నీళ్లకు ఉన్న అత్యంత ప్రాముఖ్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ? బికనేర్, శ్రీ గంగానగర్, హనుమాన్ గఢ్‌లతో పాటు రాజస్థాన్ లోని పశ్చిమ ప్రాంతాల అభివృద్ధిని పెంపొందింపచేయడంలో జలం పోషించిన కీలక పాత్రను వివరించారు. నదుల అనుసంధాన కార్యక్రమాలను అమలుపరుస్తూ, ఏక కాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందని ఆయన చెప్పారు. పార్వతి–కాళీసింధ్–చంబల్ లింక్ ప్రాజెక్టులు అందించే ప్రభావాన్ని వివరిస్తూ, వీటి వల్ల రాజస్థాన్ అంతటా పలు జిల్లాలకు ప్రయోజనాలు కలుగుతాయనీ, రైతులకు మంచి పంటలు పండుతాయనీ, ఈ ప్రాంతం దీర్ఘకాలం పురోగమిస్తుందన్నారు.

రాజస్థాన్ మొక్కవోని స్ఫూర్తిని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని ఆయన ఖండించారు. దేశం కన్నా, దేశ ప్రజల కన్నా మరేదీ గొప్పది కాదన్నారు. ఆ ఉగ్ర దాడిలో నిర్దోషులైన ప్రజలను– వారు పాటిస్తున్న ధర్మం ఏదో అడిగి మరీ ముష్కరులు వారిని పొట్టన బెట్టుకొన్నారు. పహల్‌గామ్‌లో తుపాకిగుళ్ళు పేలినప్పుడు, అవి 140 కోట్ల మంది భారతీయుల గుండెలను గాయపంచాయనీ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిందేనని దేశ ప్రజలంతా ఒక్కతాటి మీదకు వచ్చారని ప్రధాని అన్నారు. దేశ సాయుధ బలగాలు నిర్ణయాత్మక ప్రతిచర్యకు ముందుకు ఉరికాయని ఆయన ప్రధానంగా చెప్పారు. ఏ విధంగా జవాబివ్వాలనే విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు తెలిపారు. అమిత దీక్షాతత్పరతలతో యుద్ధ నిర్వహణ కార్యకలాపాలకు రంగప్రవేశం చేసిన త్రివిధ దళాలు పరస్పరం ఏకోన్ముఖ అవగాహనతో ముందుకు సాగి పాకిస్తాన్ రక్షణ వలయాలను కాకావికలు చేసి లొంగుబాటు తప్ప వేరే దారి లేని స్థితిని కల్పించాయని ఆయన తెలిపారు. ఏప్రిల్ 22 దాడికి ప్రతిగా ఇండియా ఎదురుదాడి చేసి 22 నిమిషాల లోపే 9 ప్రధాన ఉగ్రవాద స్థావరాలను నామరూపాలు లేకుండా తుడిచిపెట్టిందని ఆయన వెల్లడించారు. "ఈ చర్య దేశ బలాన్ని చాటిచెప్పింది.. పవిత్రమైన సిందూరం మందుగుండుగా మారినప్పుడు, పర్యవసానం నిశ్చయాత్మకంగా ఉంటుంద"ని ప్రధాని స్పష్టం చేశారు. అయిదు సంవత్సరాల కిందట, బాలాకోట్ దాడి అనంతరం, తాను మొట్టమొదటి సారిగా ప్రజాసభలో పాల్గొన్నది కూడా రాజస్థాన్‌లోనే అనే విషయం ఒక ముఖ్యమైన యాదృచ్ఛిక ఘటనగా ప్రస్తావించారు. అదే మాదిరిగా, ఇటీవల ఆపరేషన్ సిందూర్ పూర్తి అయిన తరువాత, ప్రధాని మొదటి జన సభ కూడా మళ్లీ రాజస్థాన్‌లోనే– బికనేర్‌లో– జరుగుతోంది. ఇది ఈ నేల పరాక్రమాన్నీ, దేశ భక్తినీ పునరుద్ఘాటిస్తోంది.

చురులో తాను దేశ ప్రజలకు చేసిన వాగ్దానాన్ని శ్రీ మోదీ గుర్తుకుతెస్తూ... "ఈ గడ్డ మీద నిల్చొని ప్రమాణం చేస్తున్నాను.. దేశాన్ని తలొగ్గనివ్వను నేను. దేశాన్ని తల వంచుకోనివ్వను నేను" అని పునరుద్ఘాటించారు. పవిత్రమైన సిందూరాన్ని చెరిపివేసేందుకు ప్రయత్నించిన వారిని మట్టికరిపించాం. మరి భారత్ నెత్తుటిని చిందించినవారు అందుకు ఇప్పుడు పూర్తి మూల్యాన్ని చెల్లించారని ఆయన రాజస్థాన్ నేల మీద నుంచి ప్రకటించారు. భారత్ నిశ్శబ్దంగా ఉంటుందని తలంచిన వారు ఇక ముఖం చూపలేక దాక్కున్నారు. మరో వైపు తమ అస్త్రాల గురించి గొప్పలు చెప్పుకున్న వారు ప్రస్తుతం మట్టి గుట్టలో కప్పబడిపోయారని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఒక ప్రతీకార చర్య కాదనీ, ఒక కొత్త రకమైన న్యాయమనీ ఆయన ప్రధానంగా చెబుతూ... అది ఘోర అన్యాయ వ్యక్తీకరణ ఒక్కటే కాదు.. తడబాటనేదే ఎరగని మన దేశ బలానికీ, దృఢసంకల్పానికీ నిదర్శనం అని ఆయన వ్యాఖ్యానించారు. దేశం ఒక సాహసోపేత వైఖరిని అవలంబించిందనీ, శత్రువును నేరుగా, తిరుగులేని విధంగా దెబ్బతీసిందనీ ఆయన స్పష్టం చేశారు. "ఉగ్రవాదాన్ని చితకగొట్టడం ఒక వ్యూహం మాత్రమే కాదు. అది ఒక సిద్ధాంతం.. ఇది భారత్.. ఇదే నవ భారత్" అని శ్రీ మోదీ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పోరాటంలో భాగంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా మూడు సిద్ధాంతాలను నెలకొల్పామని ప్రధాని వివరించారు. వాటిలో మొదటిది – భారత్‌పై ఏ ఉగ్రవాద దాడికి తెగబడ్డా అచ్చంగా ఇండియా సాయుధ దళాలే నిర్ణయించిన కాలంలో, తాము అనుసరించే పద్ధతిలో, తమ షరతుల మేరకే నిర్ణయాత్మక ప్రతిస్పందనకు దిగుతాయి అనేది. ఇక రెండో సిద్ధాంతం – పరమాణు బెదిరింపులకు దేశం జంకదు అనేదేనని ఆయన స్పష్టం చేశారు. మూడో సిద్ధాంతం – ఉగ్రవాదులకు తెర వెనుక సూత్రధారులుగా వ్యవహరిస్తున్నవారికీ, ఉగ్రవాదులకు కొమ్ముకాసే ప్రభుత్వాలకూ మధ్య భారత్ ఇక ఎంతమాత్రం వ్యత్యాసాన్నీ చూపబోదు... ఈ సిద్ధాంతం ద్వారా ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తుల మధ్య తేడాను చూడాలన్న పాకిస్తాన్ వాదనను మన దేశం తోసిపుచ్చుతోంది. ఉగ్రవాదానికి పాలు పోసి పోషించడంలో పాకిస్తాన్ పాత్రను బట్టబయలు చేయడంలో ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కృషిని ఆయన ప్రధానంగా చెబుతూ, పాకిస్తాన్ ముసుగును తొలగించి వాస్తవ స్వరూపాన్ని ప్రపంచానికి చూపడానికి వేర్వేరు రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు, విదేశీ విధాన నిపుణులతో కూడిన ఏడు బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయన్నారు.

గతంలో ప్రతీ ఘర్షణలోనూ భారత్ చేతిలో పాకిస్తాన్ వైఫల్యాన్నే ఎదుర్కొన్నదని గుర్తు చేసిన ప్రధానమంత్రి.. మన దేశంతో ప్రత్యక్ష పోరులో ఆ దేశం ఎన్నటికీ విజయం సాధించలేదని తేల్చి చెప్పారు. బహిరంగ యుద్ధాల్లో విజయం సాధించలేని పాకిస్థాన్.. చాలా కాలంగా భారత్‌పై ఉగ్రవాదాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ, హింసతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు. భారత సంకల్పాన్ని పాక్ తక్కువగా అంచనా వేసిందన్న శ్రీ మోదీ.. తన నాయకత్వంలో దేశం బలంగా, స్థిరంగా ఉందని వ్యాఖ్యానించారు. "భారత్‌పై ఏ ఉగ్రవాద దాడి జరిగినా తీవ్ర పరిణామాలుంటాయి.. సైనికపరంగా, ఆర్థికంగా పాకిస్తాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు.

నాల్ ఎయిర్‌పోర్టును లక్ష్యంగా చేసుకోవాలని పాక్ ప్రయత్నించిందనీ, అయినా ఎలాంటి నష్టమూ చేయలేక పోయిందనీ.. తానిప్పుడు బికనీర్‌కు చేరుకోగానే అదే విమానాశ్రయంలో దిగానని ప్రధానమంత్రి చెప్పారు. కచ్చితత్వంతో భారత్ చేసిన సైనిక దాడుల వల్ల పాకిస్తాన్ తన రహీంయార్ ఖాన్ వైమానిక స్థావరాన్ని చాలారోజులపాటు మూసేయాల్సి వచ్చిందని తెలిపారు. పాకిస్థాన్‌తో వాణిజ్యంగానీ చర్చలుగానీ ఉండబోవని స్పష్టం చేశారు. పాక్‌తో చర్చించాల్సి వస్తే, పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఆ చర్చల్లో ప్రధాన అంశంగా ఉంటుందని పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను ఎగదోయడం మానకపోతే ఆ దేశం ఆర్థికంగా చితికిపోవడం ఖాయమని హెచ్చరించారు. భారత్‌లో రక్తం పారిస్తున్నంత కాలం ఒక హక్కుగా పాకిస్థాన్‌కు రావాల్సిన నీటిని అందించే ప్రశ్నే లేదని, తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన కుండబద్దలుకొట్టారు. "ఇది భారత్ తీసుకున్న తిరుగులేని నిర్ణయం. ప్రపంచంలో ఏ శక్తీ దీనిని మార్చ లేదు" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

"భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే భద్రత, అభివృద్ధి రెండూ తప్పనిసరి" అని చెబుతూ, భారతదేశంలోని మారుమూల ప్రాంతాలన్నీ కూడా పురోగతి సాధించినప్పుడే ఈ దార్శనికత సాకారమవుతుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశంలో సమతాల్యంతోకూడిన వేగవంతమైన అభివృద్ధికి ఉదాహరణగా ఈనాటి కార్యక్రమం నిలుస్తుందన్నారు.

రాజస్థాన్‌ను వీరులకు నిలయంగా అభివర్ణిస్తూ.. ఆహూతులకు అభినందనలు తెలుపుతూ ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో రాజస్థాన్ గవర్నర్ శ్రీ హరిభావ్ కిషన్‌రావు బగాడే, ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, కేంద్ర మంత్రులు శ్రీ అశ్వినీ వైష్ణవ్, శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో రైల్వే మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు మెరుగుపరడమే లక్ష్యంగా.. 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 86 జిల్లాల్లో రూ. 1,100 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేసి, తీర్చిదిద్దిన 103 అమృత్ స్టేషన్లను ప్రధానమంత్రి ప్రారంభించారు.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ప్రాంతీయ వాస్తుశిల్పాన్ని ప్రతిబింబిస్తూ, ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరుస్తూ 1,300కు పైగా స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారు. కర్ణి మాత ఆలయాన్ని సందర్శించే యాత్రికులు, పర్యాటకుల కోసం దేశ్నోక్ రైల్వే స్టేషన్‌ను ఆలయ వాస్తుశిల్పం, తోరణం, స్తంభాలతో కూడిన ఇతివృత్తంతో తీర్చిదిద్దారు. కాకతీయ సామ్రాజ్య నిర్మాణ శైలి ప్రేరణగా తెలంగాణలోని బేగంపేట రైల్వే స్టేషన్‌కు మెరుగులు దిద్దారు. 52 శక్తి పీఠాలలో ఒకటైన థావేవాలి మాత కుడ్యచిత్రాలు, కళాకృతులను బీహార్‌లోని థావే స్టేషన్‌లో పొందుపరిచారు. మధుబని చిత్రకళను కూడా ఇందులో ప్రదర్శించారు. గుజరాత్‌లోని డాకోర్ స్టేషన్‌కు రాంచోడ్రాయ్ జీ మహరాజ్ స్ఫూర్తితో మెరుగులద్దారు. దివ్యాంగులతో సహా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను కల్పిస్తూ.. దేశవ్యాప్తంగా పునరుద్ధరించిన అమృత్ స్టేషన్లు ఆధునిక మౌలిక సదుపాయాలనూ, సాంస్కృతిక వారసత్వాన్నీ కూడా మేళవిస్తున్నాయి.

రైల్వే కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థంగానూ, పర్యావరణ హితంగానూ మారుస్తూ.. రైల్వే మార్గాలను 100 శాతం విద్యుదీకరించేందుకు భారతీయ రైల్వే ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా చురు–సాదుల్‌పూర్ రైల్వే లైన్ (58 కి.మీ) పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే విద్యుదీకరించిన సూరత్ గఢ్– ఫలోదీ (336 కి.మీ), ఫులేరా– డెగానా (109 కి.మీ), ఉదయ్‌పూర్ ? హిమ్మత్‌నగర్ (210 కి.మీ), ఫలోదీ–జైసల్మార్ (157 కి.మీ), సందారి–బార్మెర్ (129 కి.మీ) రైల్వే లైన్లను కూడా జాతికి అంకితం చేశారు.

రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు మరింత ఊతమిస్తూ.. వాహనాల రాకపోకలకు వీలుగా జాతీయ రహదారుల కింద 3 అండర్ పాస్ వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజస్థాన్‌లో 7 రహదారి ప్రాజెక్టులను కూడా ఆయన జాతికి అంకితం చేయనున్నారు. రూ. 4850 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ రహదారుల వల్ల రవాణా సులభతరమవుతుంది. భారత్ – పాక్ సరిహద్దు వరకు విస్తరించిన ఈ రహదారుల వల్ల భద్రతా దళాల ప్రయాణం మరింత సుగమమవుతుంది. దీంతో రక్షణపరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసినట్లవుతుంది.

అందరికీ విద్యుత్ సదుపాయాన్ని అందించడం, పర్యావరణ హిత విద్యుదుత్పాదన దిశగా బికనీర్, దిద్వానా కుచమాన్‌లోని నావా సోలార్‌తోసహా ఇతర పవర్ ప్రాజెక్టులైన... సిరోహి ట్రాన్స్మిషన్ లిమిటెడ్– పవర్ గ్రిడ్ పార్ట్– బి, మేవార్ ట్రాన్స్మిషన్ లిమిటెడ్– పవర్ గ్రిడ్ పార్ట్– ఇ లకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. బికనూరులో సోలార్ ప్రాజెక్టు, నీమచ్ పవర్ గ్రిడ్, బికనూర్ కాంప్లెక్స్ విద్యుత్ సరఫరా వ్యవస్థ తరలింపు, ఫతేగఢ్ ? ఎవి విద్యుత్ కేంద్ర సరఫరా వ్యవస్థ సామర్థ్యాభివృద్ధి ప్రాజెక్టును కూడా ప్రారంభించనున్నారు. వీటి వల్ల కాలుష్యం తగ్గడంతోపాటు పర్యావరణ హితమైన విద్యుదుత్పత్తికి వీలు కలుగుతుంది.

రాజస్థాన్‌లో మౌలిక సదుపాయాలు, రవాణా, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సేవలు, నీటి లభ్యతను పెంపొందించడం కోసం 25 ముఖ్యమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులను చేపట్టగా.. ప్రధానమంత్రి కొన్నింటికి శంకుస్థాపనలు చేయగా, మరికొన్నింటిని ప్రారంభించారు. రూ. 3,240 కోట్ల వ్యయంతో 750 కి.మీ పైగా విస్తరించి ఉన్న 12 రాష్ట్ర రహదారుల అభివృద్ధి, నిర్వహణ కోసం చేపట్టిన జాతీయ ప్రాజెక్టులకు.. అలాగే, మరో 900 కి.మీ కొత్త హైవేల విస్తరణ కార్యక్రమాలకూ శంకుస్థాపన చేశారు. బికనీర్, ఉదయపూర్‌లలో విద్యుత్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. రాజ్‌సమంద్, ప్రతాప్‌గఢ్, భిల్వారా, ధోల్‌పూర్‌లలో నర్సింగ్ కళాశాలలను ఆయన ప్రారంభించారు. ఇవి రాష్ట్రంలో ఆరోగ్యపరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఝుంఝును జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, ఫ్లోరోసిస్ నిర్మూలన ప్రాజెక్టు సహా ఈ ప్రాంతంలో వివిధ నీటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు, అలాగే అమృత్ 2.0 కింద పాలి జిల్లాలోని 7 పట్టణ నీటి సరఫరా పథకాల పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

# దీక్షలతో మానసిక ఆనందం : మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



వరంగల్, మే 22: దీక్షలతో మానసిక ఆనందం కలుగుతుంద ని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. గ్రేటర్ వరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేట బస్టాండ్ సమీపంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ దీక్ష కుటీరం స్వాముల ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఉరుకుల పరుగుల జీవితాన్ని గడుపుతున్నారని, హనుమాన్ దీక్ష కఠినమైందన్నారు. దేవుళ్ల దీక్షలతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉంటుందన్ని అన్నారు. శ్రీ భక్తాంజనేయ ఆలయ ఏర్పాటు నుంచి గత మూడు ఏండ్లుగా హనుమాన్ మాల ధారణ స్వాములకు 41 రోజుల పాటు నిత్యం అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారి కుటుంబ సభ్యులందరికీ ఆ భగవంతుడు ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్న మాడిశెట్టి శ్యామ్, వెనుకంటి యాదగిరి లను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెనుకంటి సారంగపాణి- విజయ దంపతులు, వేల్పుల వేణుగోపాల్, ఏనుగుల రాంప్రసాద్, రాజేష్, శివ, సురేందర్ రెడ్డి, రమేష్, యాదగిరి, చిరంజీవి, తదితరులతో పాటు హనుమాన్ దీక్ష స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి గొంగిడి మహేందర్‌రెడ్డి ఆర్థిక సాయం



యాదగిరిగుట్ట, మే 22 : బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం యాదగిరిగుట్ట పట్టణ నాయకుడు సదా ప్రవీణ్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అండగా నిలిచారు. గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పార్టీ తరపున రూ. 1.05 లక్షల నగదు, చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, నాయకులు ఆరె శ్రీదర్ గౌడ్, ముఖ్యర్ల శ్రీశైలం, సతీశ్ యాదవ్, ఆవుల సాయియాదవ్, పాండవుల భాస్కర్ గౌడ్, కోన్యాల నర్సింహారెడ్డి, పల్లె సంతోశ్‌గౌడ్, మిట్ట అనిల్ గౌడ్, యాకుబ్, సూదగాని శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# జాతీయ విద్యావిధానం..మోదీ ప్రభుత్వంపై కోర్టుకెక్కిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నయ్ మే 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొంతకాలంగా ఓ యుద్ధమే జరుగుతోంది. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ సూత్రం ప్రకారం, విద్యార్థులు ఇంగ్లిష్ మరియు ప్రాంతీయ భాషతో పాటు మూడో భాషను కూడా నేర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, జాతీయ విద్యావిధానం ముసుగులో కేంద్రం తమపై హిందీ భాషను బలవంతంగా రుద్దుతోందని తమిళనాడు ప్రభుత్వం మండిపడుతోంది. ఈ అంశంలో స్టాలిన్ ప్రభుత్వం తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జాతీయ విద్యా విధానం అమలు చేయడం లేదన్న కారణంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ రాష్ట్రానికి రావాల్సిన రూ. 2,151 కోట్ల నిధులను నిలిపివేసిందని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. పాఠశాల విద్య కోసం ఉద్దేశించిన సమగ్ర శిక్ష పథకం అవసరాలకు అనుగుణంగా తమిళనాడు ఉందని గతేడాది ఫిబ్రవరి 16న జరిగిన ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ తర్వాత ఈ పథకం కింద ఖర్చు కోసం రూ. 3,585.99 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందని పేర్కొంది. ఇందులో 60:40 నిష్పత్తి ప్రకారం, కేంద్రం వాటా రూ. 2,151 కోట్లు అని తెలిపింది. ఈ నిధులు గత ఏడాది ఏప్రిల్ 1 నుంచే రాష్ట్రానికి చెల్లించాల్సి ఉందని తెలిపింది. అయితే, జాతీయ విద్యా విధానం అమలు చేయడం లేదన్న కారణంతో ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని పిటిషన్‌లో వివరించింది.

# మోడీ గారి నాయకత్వంలో భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది

## -ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్, మే 22:మోడీ గారి నాయకత్వంలో భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ 106 అమృత్ స్టేషన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా.. వరంగల్ రైల్వే స్టేషన్లో జరిగిన కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. మోడీ గారి నాయకత్వంలో భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో దానికి సజీవ సాక్ష్యం ఈరోజు పునఃప్రారంభమైన రైల్వే స్టేషన్లు. ఎయిర్పోర్టులను తలపించే పద్ధతిలో రైల్వే స్టేశన్లు అభివృద్ధి చెందుతున్నాయి. స్వతంత్రం వచ్చినప్పుడు నుండి 2014 వరకు ఎంత అభివృద్ధి జరిగిందో ఈ పది సంవత్సరాల కాలంలో అంతకంటే వేగంగా అభివృద్ధి చెందుతుంది అని చెప్పడానికి సజీవ సాక్ష్యం చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ, నాంపల్లి ఇలా 106 రైల్వే స్టేషన్లు. రాష్ట్రాలు అభివృద్ధి చెందందే దేశం అభివృద్ధి చెందదు. రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏవైనా ఉండొచ్చు కానీ అన్ని రాష్ట్రాలు సమగ్రంగా అభివృద్ధి చెందితే దేశం బాగుపడుతుందని చెప్పి మోడీ గారు భావిస్తున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌ను ప్రజలకు అంకితం చేస్తున్నందుకుశుభాకాంక్షలు.

# వ్యవసాయ సాగులో నూతన యజమాన్య పద్ధతులు పాటించాలి

హైదరాబాద్, మే 22: తిమ్మా జీపేట మండలం మారేపల్లి గ్రామం లో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పాలెం ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవే త్తలు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్రం ఏడీ ఆర్ డాక్టర్ సుధాకర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శశి భూషణ్ మాట్లాడుతూ సాగులో రైతులు ఎదుర్కొంటున్న, సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. వ్యవసాయ సాగులో నూతన యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడకం, అవసరం మేరకు రసాయన, పురుగుమందుల వినియోగం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి, చెట్ల పెంపకం గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. స్థానిక రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఫ్రాంట్ బ్రీడింగ్, రమేష్, పూర్ణచందర్ రెడ్డి, స్థానిక ఏఈవో సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

# జూన్ 20వ తేదీలోగా కోర్టు ముందు హాజరుకండి - ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ఆదేశం

హైదరాబాద్, మే 22:హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావుకు నాంపల్లిలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ 20వ తేదీలోగా కోర్టు ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది.

గడువులోగా ప్రభాకర్ రావు కోర్టు ముందు హాజరుకాని పక్షంలో ఆయనను 'ప్రొక్లెయిమ్డ్ అఫెండర్' (ప్రకటిత నేరస్థుడు)గా పరిగణిస్తామని కోర్టు హెచ్చరించింది. ఈ ఏడాది జనవరిలోనే ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడు ఎ. శ్రవణ్ కుమార్‌రావును ప్రొక్లెయిమ్డ్ అఫెండర్లుగా ప్రకటించే ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతించాలని కోరుతూ హైదరాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీరిద్దరూ విదేశాలకు పారిపోయారని, అధికారిక నోటీసులను పట్టించుకోకుండా అరెస్టు నుంచి తప్పించుకు తిరుగుతున్నారని పోలీసులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రవణ్ కుమార్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

తనను అరెస్టు చేయరనే షరతుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరయ్యేందుకు శ్రవణ్‌కుమార్ అంగీకరించారు. ప్రభాకర్‌రావు విషయంలో మాత్రం ప్రొక్లమేషన్ ప్రక్రియను కొనసాగించేందుకు నాంపల్లి కోర్టు పోలీసులకు అనుమతినిచ్చింది. ఇందులో భాగంగానే, ప్రభాకర్‌రావు స్వచ్ఛందంగా హాజరయ్యేందుకు జూన్ 20ని తుది గడువుగా నిర్దేశించింది. ఒకవేళ ఆయన ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే, అభియోగాలు నమోదు చేసిన 90 రోజుల తర్వాత ఆయన గైర్హాజరీలోనే విచారణ జరిపే అవకాశం ఉందని కోర్టు తెలిపింది.

### శ్రవణ్ కుమార్ కస్టడీ పిటిషన్‌పై ఉత్కంఠ

మరోవైపు, ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ కుమార్‌రావుపై మరో మోసం కేసు కూడా నమోదైంది. ఐరన్ ఓర్ కొనుగోలు పేరిట అఖండ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను శ్రవణ్ కుమార్, ఆయన అనుచరులు రూ. 6.58 కోట్లకు పైగా మోసం చేశారని ఆ సంస్థ డైరెక్టర్ ఆకర్ష్ కృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ చీటింగ్ కేసుకు సంబంధించి శ్రవణ్ కుమార్‌ను ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ఈ కేసులో శ్రవణ్ కుమార్‌ను విచారించేందుకు కస్టడీ అవసరమని పోలీసులు కోరారు.

# తెలంగాణ రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే గ్లామర్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు - కేటీఆర్



హైదరాబాద్, మే 22: తెలంగాణ రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం గ్లామర్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తన విపరీతమైన ప్రవర్తన, పక్కదారి పట్టిన ప్రాధాన్యతలు, రాజకీయ నిజాయతీ లోపం కారణంగా రాష్ట్రాన్ని నడిపించడానికి అనర్హుడని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ భవన్ లో నేడు జరిగిన నిర్మల్ నియోజకవర్గ నేతల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుండ పగిలితే పగిలింది కానీ కుక్క బుద్ధి తెలిసింది అని పెద్దలు అంటారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి పోయిన మాజీ మంత్రి ఇంద్రకరన్ రెడ్డిని చూస్తే ఈ సామెత నిజమే అనిపిస్తుంది. పదవితోను అధికారంతో మనిషికి గౌరవం దక్కదు రాదు. కష్ట కాలంలో కూడా తల్లి లాంటి పార్టీని నమ్ముకొని ఉన్నోడే నిజమైన నాయకుడు అవుతాడు. నిన్న మొన్నటి దాకా బీఆర్ఎస్ లో ఉన్న ఓ నాయకుడు కాంగ్రెస్ లోకి పోతామంటే ఆ పార్టీ వాళ్లు వద్దని ధర్నాలు చేశారు, అయినా ఆ నాయకుడికి సిగ్గు రాలేదు. బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు జిల్లా మంత్రిగా అపారమైన గౌరవాన్ని ఆ నాయకుడు పొందాడు. ఇప్పుడు కాంగ్రెస్ లో కనీసం కూర్చోమని చెప్పే వాళ్ళు లేరు.

మనం చేసే పనులతో, మన క్యారెక్టర్ తోనే మనకు గుర్తింపు వస్తుంది తప్ప పదవులతో అధికారంతో రాదు. పోయినోళ్ళు పోనీ ఉన్న వాళ్ళతోనే పార్టీని బలోపేతం చేసుకుందాం. నిర్మల్, ముథోల్, ఖానాపూర్లో తిరిగి గులాబి జెండా రెపరెపలాడించాలి. రేపు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల కోసం హైదరాబాద్ నుంచి అబ్జర్వర్లను పంపుతాము. ఒక్క ఊరుని, ఒక్కో నియోజకవర్గాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గెలిచాక పార్టీ నమ్ముకుని ఉండే వాళ్లకు టికెట్లు ఇస్తాం, గెలిపించుకుందాం. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ మండలాల్లో మళ్లీ పార్టీని పటిష్టం చేసుకుందాం.

ఇవ్వాళ తెలంగాణలోని ప్రతి వ్యక్తి కాంగ్రెస్ పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని చెప్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా తమ ప్రభుత్వ పాలనను ఇష్టపడడం లేదు. రైతులు అయితే ప్రతి ఊర్లో బాధపడుతున్నారు. 100% రుణమాఫీ ఎక్కడ అయ్యిందో చూపెట్టాలని అసెంబ్లీలో రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే సైలెంట్ గా ఉన్నాడు తప్ప ఒక్క మాట మాట్లాడలేదు. రేవంత్ సొంత ఊరు కొండారెడ్డి పల్లిలో గాని, సొంత నియోజకవర్గం కొడంగల్ లో గాని ఆయనకు పిల్లనిచ్చిన నియోజకవర్గం కల్వకుర్తిలో గాని ఎక్కడైనా సరే ఒక్క ఊర్లో 100% రుణమాఫీ అయిందంటే రాజకీయ సన్యాసం తీసుకుంటామని ఛాలెంజ్ చేస్తే ఇప్పటిదాకా కాంగ్రెస్ నుంచి జవాబు లేదు.

రుణమాఫీకి రూ. 49,500 కోట్లు కావాలని అధికారంలోకి వచ్చిన మూడు రోజులకు భట్టి విక్రమార్క చెప్పిండు. ఒక్క సంవత్సరం కడుపు కట్టుకుంటే 40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి గతంలో చెప్పిండు. క్యాబినెట్ సమావేశంలో రూ. 31 వేల కోట్ల రుణమాఫీ అన్నరు. అసెంబ్లీలో రూ. 26 వేల కోట్ల రుణమాఫీ అన్నారు. రూ. 11,000 కోట్లు ఇచ్చాము రుణమాఫీ చేయండి అని బ్యాంకర్లకు భట్టి విక్రమార్క చెప్పాడు. రూ. 49,500 కోట్ల రుణమాఫీ చివరకు రూ. 11వేల కోట్లకు వచ్చింది. అది కూడా పూర్తిగా కాలేదు. ఇచ్చింది చారానా వంతు అయితే బిల్డప్ మాత్రం బారానా వంతు చేసుకున్నారు. 500 మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటే అందాల పోటీల్లో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నాడు.

వానలు పడుతుంటే కల్లాలలో వడ్లు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. మొలకలు వస్తే రైతు ఆగమై రోడ్డుమీద పడే పరిస్థితి ఉంది. అడిగే వాళ్ళు లేరు, పట్టించుకునే వాళ్ళు లేరు. ఊర్లో సర్పంచ్ లేడు, ఎంపీటీసీ లేడు, జడ్పీటీసీ లేడు, ఎమ్మెల్యే లేడు. కాంగ్రెస్ నేతలందరూ సెక్రటేరియట్ చుట్టూ పైరవీలు కోసం తిరుగుతున్నారు. ఈ ప్రభుత్వం 20%-30% కమిషన్ల చుట్టూనే తిరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు కావాలంటే పైసలు ఇవ్వాల్సిందేనని మంత్రి సురేఖ చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఒకతను మా మంత్రులంతా 30% కమిషన్ తీసుకుంటున్నారని బహిరంగంగానే చెప్తున్నారు. 20%, 30% కమిషన్ మీకు ఇస్తే మాకే మిగిలిది ఏంటని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చాంబర్ ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారు. 17 నెలల కాలంలోనే కాంగ్రెస్ చేస్తున్న దోపిడీ బాగోతం తెలంగాణలోని ఊరూరుకీ చేరింది.

చరిత్రలో ఇప్పటిదాకా చూడని విధంగా వరంగల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగింది. ఆ సభ తర్వాత, అక్కడ కేసీఆర్ ని చూసిన తర్వాత ఆయన ప్రత్యర్థులకు గజ్జుమంది. అందుకే తమ అవినీతి బాగోతం, కమిషన్ల దందాల నుంచి ప్రజల దృష్టినీ మరల్చడానికి కాళేశ్వరం విషయంలో కేసీఆర్ గారికి నోటీసులు ఇచ్చారు. పాతబస్తీ అగ్ని ప్రమాద బాధితులను కలవడానికి రేవంత్ రెడ్డికి తీరికలేదు. ఆయన అందాల పోటీల్లో బిజీగా ఉన్నారు. మింగ మెతుకు లేదు గానీ మీసాలకు సంపెంగ నూనె పెట్టుకున్నాడట వెనుకటికి ఎవరో. రాష్ట్రం దివాలా చేసిందని చెప్పే ముఖ్యమంత్రి అందాల పోటీలకు కోట్ల కోట్ల రూపాయలు ఇస్తున్నాడు. అపరిచితుడు సినిమాలోని రెమోలాగా రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు, అప్పు పుట్టడంలేదు, అందరూ దొంగల్లాగా చూస్తున్నారని చెపుతున్నాడు. కానీ అదే రేవంత్ రెడ్డి రూ. 1,50,000 కోట్ల రూపాయలు అప్పు చేసినా అని అపరిచితుడు రాము లెక్క అసెంబ్లీలోనే ఒప్పుకుంటాడు.

సంవత్సరానికి రూ. 40 వేల కోట్ల చొప్పున 9 సంవత్సరాల పాటు కేసీఆర్ అప్పు చేస్తే తప్పట. కానీ రేవంత్ రెడ్డి ఒక సంవత్సరంలోనే 1,50,000 కోట్ల రూపాయలు అప్పు చేస్తే తప్పు కాదట. కానీ కేసీఆర్ అప్పుచేసి ప్రజలకు పంచాడు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారు. రూ. 73 వేల కోట్ల రూపాయలతో రైతుల ఖాతాల్లో రైతుబంధు పైసల్ని వేశాడు. రైతుల ఖాతాల్లో టకి టకీమని డబ్బులు పడట్లేదు గానీ ఢిల్లీలో రాహుల్ గాంధీ ఖాతాలో కాంగ్రెస్ అగ్రనేతల ఖాతాల్లో ఠంచన్ గా పైసలు పడుతున్నాయి.

ఇక్కడ దోచుకున్న పైసలు అక్కడ ఢిల్లీలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు పంచుతున్నాడు. లేకుంటే తనకు పదవి ఉండదన్న సంగతి ఆయనకు తెలుసు. కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్తూనే ఆయన హయాంలో జరిగిన నియామకాలకు ఈయన పత్రాలు ఇస్తున్నాడు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తానని చెపుతున్న రేవంత్ రెడ్డి, అందాల పోటీలకు వచ్చిన వారికి కేసీఆర్ కట్టించిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టీ-హబ్, బుద్ధవనం, యాదగిరిగుట్టకు తీసుకుపోతాడు.

55 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చెప్పుకోవడానికి, చూపించుకోవడానికి ఒక్క ఘనత కూడా లేదు. నిజాం కట్టిన చార్మినార్ నైనా చూపించాలి లేదంటే కేసీఆర్ కట్టించిన అద్భుతాలనైనా చూపించాలి. మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధితో రేవంత్ రెడ్డి బాధపడుతున్నాడు. ఒకటే మనిషి నలుగురు లెక్క నటించడమే ఈ వ్యాధి లక్షణం. ఓవైపు కాళేశ్వరం కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టులో భాగమైన కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్ కు నీళ్లు తీసుకొస్తారని చెప్పుకుంటాడు ఇందులో ఏది నిజం. నిజంగానే కాళేశ్వరం కూలిపోతే కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ లో నీళ్ళు ఎక్కడి నుంచి వస్తాయి.

సంవత్సరానికి రూ. 40 వేల కోట్ల రూపాయలు అప్పు చేసిన కేసీఆర్ రైతుబంధు ఇచ్చిండు. 24 గంటలు ఫ్రీగా కరెంట్ ఇచ్చిండు. మిషన్ భగీరథతో మంచినీళ్లు ఇచ్చిండు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టిండు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిండు. మా ఒక్క ఎమ్మెల్యే ఓడిపోతే ఏమవుతుంది? అక్కడ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటాడు కదా అని చాలామంది తెలంగాణ ప్రజలు అనుకోవడంతోనే ఫలితాలు ఇలా వచ్చాయి.

కేసీఆర్ ను దొర దొర అని తిట్టినవాళ్లే ఇప్పుడు రేవంత్ రెడ్డిని దొంగ దొంగ అంటున్నారు. స్వాతంత్రం వచ్చిన 77 సంవత్సరాల తర్వాత కూడా ఈ దేశాన్ని ఏలుతున్న వారికి ఈ ప్రజలకు ఏం కావాలో ఏం చేయాలో తెలియడం లేదు. కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 9 ఏళ్ల కాలంలో అటు పల్లె ప్రజలకు ఏం కావాలో, ఇటు పట్నంలో ఉండే వాళ్లకు ఎలాంటి అవసరాలు ఉంటాయో తెలుసుకొని పనులు వారికి చేశారు.

దసరా పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు ఇచ్చిండు. ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చిండు. క్రిస్టియన్ లకు క్రిస్మస్ కానుకలు ఇచ్చిండు. కులం మతం పంచాయతీ పెట్టకుండా ప్రజలందరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. ప్రజల చిరకాల కోరికలైన నిర్మల్ మంచిర్యాల ఆసిఫాబాద్ జిల్లాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నిర్మల్ లో మెడికల్, నర్సింగ్ కాలేజ్ వస్తాయని ఎవరు అనుకోలేదు. కానీ కేసీఆర్ చేసి చూపించారు. తెలంగాణ రాకముందు ఐదు మెడికల్ కాలేజ్ మాత్రమే ఉండేవి కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా 33 మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ఇది భారతదేశ చరిత్రలో ఎక్కడ జరగలేదు.

ఇన్ని మంచి పనులు చేసిన తర్వాత కూడా కేసీఆర్ కి అనుకున్న ఫలితం రాలేదు. అందుకు పార్టీ పరంగా కొన్ని లోపాలు ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంట్లోనే కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు వస్తాయి. అలాంటిది లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీలో అభిప్రాయ భేదాలు ఉండడం సహజమే. అభిప్రాయ భేదాలను పక్కనపెట్టి అధిష్టానం ఎవరికీ టికెట్ ఇస్తే వారికి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలి. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆగ్రహం ఉన్న మాట నిజమే కానీ బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పని చేయకుంటే అనుకున్న ఫలితాలు రావు.

లొట్ట పీసు కేసులతోని అయ్యేది ఏమీ లేదు. రేవంత్ రెడ్డి కథ ముగిసింది. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్టు పైసల సంపాదన మీద పడ్డాడు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తారని చెప్తున్నారు రేవంత్ రెడ్డి ముందుగా ఆడబిడ్డలకు ఇస్తానన్న నెలకు రూ. 2500 రూపాయలను వెంటనే ఇవ్వాలి. రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ లో మళ్ళీ గులాబీ జెండా ఎగరాలంటే ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు విభేదాలను పక్కన పెట్టుకొని కష్టపడి పని చేయాలి. పదేళ్ల అధికారం అప్పజెప్పిన ప్రజలు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండమని అంటే ఆ పాత్రను కూడా బీఆర్ఎస్ అద్భుతంగా పోషిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎక్కడికక్కడ నిలదీస్తున్నాము. జూన్, జూలైలో పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. నిర్మల్ జిల్లాలో మెంబర్ షిప్ డ్రైవింగ్ లో విజయవంతం చేయండి. కాంగ్రెస్ బీజేపీలను ఎండబెట్టి తెలంగాణకు గుండె ధైర్యం అయిన గులాబీ జెండాను మరొక్కసారి ఎగిరేయాలని కోరుకుంటున్నానని అన్నారు .

# పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నిజామాబాద్, మే 22: బోధన్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ అధికారులకు సూచించారు. రాకాసిపేటలోని వాటర్ వర్క్స ను ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వాటర్ బాక్స్ లోని నీటి పారిశుధ్యాన్ని, బెల్లాల్ చెరువు నుంచి నిత్యం వినియోగిస్తున్న నీటి వివరాలు ఆయన మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బెల్లాల్ చెరువులోకి నీటి సరఫరా జరిగే కాలువకు మరమ్మతులు జరిపించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ తో పాటు మున్సిపల్ కమిషనర్, డీఈ యోగేష్, ఏఈ ముఖయ్యర్ సిబ్బంది ఉన్నారు.

# విజయసాయిరెడ్డి చంద్రబాబుకు లొంగిపోయారు

## -వైసిపి మాజీ రాజ్యసభ ఎంపి విజయసాయి రెడ్డిపై జగన్ సంచలన వ్యాఖ్యలు

అమరావతి మే 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వైసిపి మాజీ రాజ్యసభ ఎంపి విజయసాయి రెడ్డిపై ఆ పార్టీ అధినేత జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి చంద్రబాబుకు లొంగిపోయారని దుయ్యబట్టారు. ఈ మేరకు జగన్ వీడియోతో మాట్లాడుతూ.. కూటమికి మేలు చేయడానికి విజయసాయి రెడ్డి తన రాజ్యసభ సీటు అమ్మేసుకున్నారని జగన్ ఆరోపించారు. అలాగే, కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ‘‘రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. యాక్సిస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. రూ. 11 వేల కోట్ల స్కాం ఇది. మా హాయంలో మేము సెకితో కుదుర్చుకున్న ఒప్పందం 2.49 రూపాయలు. ఇప్పుడు 2.11 రూపాయల అదనంగా పెట్టి ఒప్పందం చేసుకున్నారు. ఇలా 25 ఏళ్లలో 11 వేల కోట్లు ప్రజాధనాన్ని ఆ కంపెనీ వాళ్లకు ఇస్తున్నారు. నాలుగు గంటల పీక్ అవర్స్ పేరు చెప్పి 24 గంటలకు అదే రేటుతో కొనుగోలు చేస్తున్నారు. అన్నీ విషయాలు ఆధారాలతోనే చెప్తున్నాం. రాష్ట్ర ఖజానాను ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టిన చరిత్ర దేశంలోనే ఎక్కడా ఉండదు. అప్పుల కోసం ప్రైవేట్ వ్యక్తులకు అధికారాన్ని ఇవ్వకూడదు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన. ఏపీఎండీసీని అంధకారం చేస్తున్నారు. శాశ్వతంగా అప్పులు ఊబిలో కూరుకు పోయేలా చేస్తున్నారు. మన మైన్స్ మీద ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడుతున్నారు” అని జగన్ ఆరోపించారు.

# శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో



ఆదిలాబాద్, 22: ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి యాదయ్య , అదనపు డైరెక్టర్ శ్రీనివాస చారి సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను వారు సందర్శించి పలు సూచనలు చేశారు. మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులను అలవరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈవో ప్రభాకర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఆబిద్ అలీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్‌కాలేజీలో సమస్యలు పరిష్కరించాలి కేయూ వీసీకి బోధనేతర సిబ్బంది వినతి

హనుమకొండ , మే 22: కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలో నెలకొన్న 16 సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్ట్స్‌కాలేజీ బోధనేతర సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆరేడు నెలలుగా ఆర్ట్స్ కాలేజీ సహాయక రిజిస్టర్ లేరన్నారు. కాలేజీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కాలేజీని అందంగా తీర్చిదిద్దడం కోసం కావాల్సిన నిధులను సమకూ ర్చాలని కోరారు. అదేవిధంగా పెండి ంగ్ సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని బోధనేతల సిబ్బంది సంఘం అధ్యక్షులు భూక్య రాజు కోరారు. కాలేజీలో సమస్యలను పరిష్కరిం చేందుకు వీసీ సానుకూలంగా స్పందించారని రాజు తెలిపారు.

